నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 22 మార్చి 2025 | www.navatelangana.com

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ ఇంచార్జి తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 993, 630 ప్రభుత్వ భూముల్లో కొంతమంది ఆక్రమణదారులు రాత్రికి రాత్రి కబ్జా చేసి ఇండ్లు నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో వెంటనే స్పందించిన తహసిల్దార్ రెవిన్యూ సిబ్బందిని అక్కడికి పంపించి జెసిబితో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అక్రమంగా నిర్మాణాలు ఎవరు చేపట్టినా సహించేది లేదని ప్రజలు ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రఘురాం రెడ్డి, శ్రీమన్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసం



జాగ్రత్తగా ఉండాలని కమిషనర్ సూచన

నవతెలంగాణ-సదాశివపేట

ఒకప్పుడు సైబర్ నేరగాళ్లు చరవాణి నంబర్‌కు సమాచారం ఇచ్చి ఓటిపి ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు కొల్లగొట్టేవారు. రాను రాను వారి మోసాలను ప్రజలు గుర్తించడంతో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా సదాశివపేట పట్టణంలో సైబర్ నేరగాళ్లు మున్సిపల్ కమిషనర్ పేరిట పలువురికి ఫోన్లు చేసి మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని, నల్ల కనెక్షన్ బిల్లు చెల్లించాలని, లేనియెడల ఫైన్ వేయాల్సి వస్తుందని తాము పంపించిన ఫోన్ నెంబర్ కు (917989272438) ఫోన్ పే, గూగుల్ పే చేయాలని వస్తున్న వదంతులను ఎవరు నమ్మవద్దని, పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఉమా సూచించారు.

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్‌లలో డంపుయార్డుకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రజా బ్యాలెట్ ఓటింగ్ విధానానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చింది.





మబ్బులు.. ఉరుములు చల్లబడిన వాతావరణం







- మేఘావృతంతో ఉరుములు, మెరుపులు
- గాలికి రాలిన మామిడి కాయలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు చోట్ల వర్షం, గాలులు
- వరి పైర్లకు కాస్త ఊరట అంటున్న రైతులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాల్లో పలు చోట్ల వర్షాలు కురిశాయి. వాతావరణ శాఖ వెల్లడించిన మేరకు తేలిక పాటి వర్షం అక్కడక్కడ పడింది. ఎండా కాలంలో వర్షం పడడం, వాతావరణం చల్లబడడంతో కాస్త ఊరటగా కనిపిస్తుంది. వాతావరణంలో మార్పులు రావడం వల్ల చల్లధనం ఏర్పడింది. సాయంత్రం వరకు మండిన ఎండలు ఉన్నటుండి మాయమయ్యాయి. వాతావరణంలో మబ్బులు కమ్ముకోవడం, మెరుపులు మెరవడంతో వర్షం పడే వాతావరణం నెలకొంది. ఉమ్మడి మెదక్ జిల్లాల్లో పది మండలాల్లో వర్షం పడింది. కొన్ని చోట్ల ఈదురు గాలులు వీచాయి. మరి కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. ఇంకొన్ని చోట్ల మాత్రం చిన్నపాటి వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లాలో ఐదారు మండలాల్లో వర్షం కురిసింది. వట్‌పల్లి, న్యాల్‌కల్, సంగారెడ్డి, కంది ఇతర ప్రాంతాల్లో వర్షం, తేలికపాటి చినుకులు పడ్డాయి. మెదక్ జిల్లాలో పాపన్నపేట, అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట ప్రాంతంలో వర్షం బాగానే పడింది. పాపన్నపేట మండలంలో గాలులతో కూడిన వర్షం పడడం వల్ల పలు గ్రామాల్లో మామిడి పిందెలు, కాయలు నేల రాలాయి. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, మర్కుక్, జగదేవ్‌పూర్ ఇతర ప్రాంతాల్లో గాలులు, చిరు జల్లులు, కొద్దిపాటి వర్షం కురిశాయి.

పైర్లకు మేలే అంటున్న రైతులు

అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడం వల్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రెండు వర్షాలు పడితే ఇప్పటికే వాడుబట్టిన వరి, జొన్న పైర్లకు కాస్త మేలు జరుగుతుందని ఆశపడుతున్నారు. కింది భాగం పొలాలు ఇప్పటికే పూర్తిగా ఎండిపోయాయి. అయితే వరుస తడులపై పారుతున్న వరి పైర్లకు వర్షపు నీరు కొంత ఉపయోగపడనుంది. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో యాసంగిలో సాగు చేసిన వరి పైర్లకు తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడింది. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో పలు ప్రాజెక్టుల్లో నీళ్లన్నా విడుదల చేయకపోవడం వల్ల వరి పైర్లు ఎండిపోయాయి. సిద్దిపేట జిల్లాలో సాగునీటిని విడుదల చేయాలని విపక్షాలు, రైతులు పట్టుపట్టడంతో కాల్వలకు నీళ్ల వదిలారు. దీంతో నీటి ఎద్దడి సమస్య కాస్త తీరింది. సంగారెడ్డి జిల్లాలో సింగూరు ఎడమ కాల్వకు నీళ్ల విడుదల చేయకపోవడం వల్ల ఇప్పటికే వేల ఎకరాల్లో వరి పైర్లు ఎండిపోయాయి. అలా నీళ్ల పారని పొలాలకు ఈ వర్షం వల్ల ఏర్పడే తడి కొంత ఉపయోగపడనుంది. అయితే కొన్ని చోట్ల మామిడి తోటలు కాయ దశల్లో ఉన్నాయి. పూత పిందెగా మారి కాయగా పెరుగుతున్నాయి. గాలుల వల్ల రెండు మూడు మండలాల్లో మామిడి కాయలు, పిందెలు నేల రాలిపోయాయి. అకాల వర్షం వల్ల కొంత లాభం ఉండగా ఇంకొంత నష్టం కూడా ఏర్పడుతుంది

> వాతావరణ శాఖ ముందస్తు ప్రకటించిన మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం పూట మబ్బులు కమ్ముకున్నాయి. ఎండలు మండుతున్న వేళ్ల ఉరుములు, మెరుపులతో వాతావరణంలో మార్పులు సంభవించాయి. పలు చోట్ల ఈదురు గాలులు వీచాయి. అక్కడక్కడ వర్షం కురిసింది. వాతావరణం చల్ల బడింది. తడిలేక ఎండుతున్న పైర్లకు కాస్త ఊరట కలగనుంది. అయితే గాలులు బలంగా వీచిన చోట మామిడి పిందెలు, కాయలు నేల రాలాయి. ఎండ ప్రబావంతో సాయంత్రం వేళ కూడా ఉడకపోతతో ప్రజలు ఇబ్బంది పద్దారు. ఉన్నట్లుండి వాతావరణంలో మార్పులొచ్చే సరికి చల్లపడింది.

అంగన్వాడి కేంద్రాలలో నూతన బోధనా పద్ధతులు అవలంబించాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అంగన్వాడీ కేంద్రాలలో నూతన బోధనా పద్ధతులను అవలంబిస్తూ పూర్వ బాల్యదశ విద్యార్థులకు సులువుగా వివిధ అంశాలలో పరిజ్ఞానం కలిగించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిదవ పూర్వ బాల్య సంరక్షణ విద్య వార్షిక సదస్సు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అంగన్వాడీ టీచర్లు అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతుల పరిశీలనను వాటి ఆధారాలు అనుభవాలను ఇతరులతో పంచుకోవడానికి, ఆయా విషయాలపై చర్చించడానికి అంగన్వాడీ టీచర్లు అందరికీ అవకాశం కల్పించాలని ఉద్దేశంతో, గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో చర్చించిన విషయాలు నూతన పాఠ్యప్రణాళిక అమలు చేయడంలో అంగన్వాడి టీచర్లు పాటిస్తున్న ఉత్తమమైన పద్ధతులు వాటి వలన పిల్లల అభివృద్ధిలో కలిగిన మార్పులు ఆధారంగా నూతన సిలబస్ ను, ప్రీస్కూల్ కార్యక్రమాల నిర్వహణలో అంగన్వాడీ టీచర్లు గమనించిన మార్పుల ను ఈ సదస్సులో చర్చించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పిల్లలలో జిజ్ఞాసను, సాంస్కృతిక అభివృద్ధిని పెంపొందించడానికి అంగన్వాడీ టీచర్లు కల్పించిన అవకాశాలు వాటి ఫలితాలపై ఈ సదస్సులో చర్చించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల మధ్య సమన్వయం కొరకు పాటించిన ఉత్తమ పద్ధతులు దాని ఫలితంగా పూర్వ ప్రాథమిక విద్య నిర్వహణలో, వచ్చిన మార్పులు, ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని అధిగమించడానికి అవలంబించిన పద్ధతులు అంగన్వాడీ టీచర్లు కేంద్రంలో లేనప్పుడు హెల్పర్లు పిల్లలతో కృత్యాలను నిర్వహిస్తున్న విధానం పై చర్చించారు . ఈ సందర్భంగా ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టు నుండి టీచర్లు రాసిన వ్యాసాలు నుండి ఎనిమిది టీచర్లు తమ వ్యాస రూప ప్రతిపాదనల పేపర్ ప్రజెంటేషన్ చేశారు. 18 మంది టీచర్లు పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు .నలుగురు టీచర్లు చర్చా కార్యక్రమం ద్వారా తాము అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను ఇతర టీచర్లతో పంచుకున్నారు. ఈ సదస్సు ద్వారా అంగన్వాడీ టీచర్లకు నూతన పాఠ్యప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంలో మెరుపులు విద్యార్థుల అభివృద్ధికి కల్పించాల్సిన అవకాశాలు హెల్పర్ల తో ఏ విధంగా సమన్వయం చేసుకోవాలి అనే విషయాలపై మంచి అవగాహన ఏర్పడింది. వీటితోపాటు ఐదు ప్రాజెక్ట్ నుండి టీచర్లు తయారు చేసిన మరియు అంగన్వాడీలో పిల్లలు ఉపయోగిస్తున్న మెటీరియల్ను కూడా ప్రదర్శించారు. సదస్సును ఉద్దేశించి రాష్ట్ర ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ ఆన్లైన్ ద్వారా వర్చువల్ పద్ధతిలో తమ సందేశాన్ని వినిపించారు.ఈ కార్యక్రమములో ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్జేడి మోతి, జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి, జిల్లాలోని సి డి పి ఓ లు, సూపర్ వైజర్స్, ఐదు ఐసిడిస్ ప్రాజెక్ట్ నుండి దాదాపు 350 మంది అంగన్వాడి టీచర్లు, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సభ్యులు , సిబ్బంది పాల్గొన్నారు..



ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

డిఎస్పి రామ్మోహన్ రెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్



పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా వివిధ పరిశ్రమల నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టాలని డిఎస్పి రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయ ఆవరణలో వివిధ పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పరిశ్రమలో తప్పకుండా ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వివిధ పరిశ్రమల్లో విద్యుత్, వివిధ కారణాల రీత్యా అగ్ని ప్రమాదాలు సంభవించి అమూల్యమైన ప్రాణాలను కార్మికులు, ఉద్యోగస్తులు కోల్పోతున్నారన్నారు. అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని పరిశ్రమల్లో కూడా ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలు చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడంతో అక్కడక్కడ అడపాదడప విద్యుత్, అగ్ని ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయన్నారు. ఎండలు తీవ్రమవుతున్నందున పరిశ్రమల ఆవరణలోని ప్రాంతాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని సైతం ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. విధంగా రకాల వ్యర్థాలను కూడా నిల్వ ఉంచుకోకూడదని సూచించారు. ఈ సమావేశంలో సీఐ శివలింగం, ఎస్సై లు కాశీనాథ్, రామ్మోహన్ రెడ్డి, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్‌ని వెనక్కి తీసుకోవాలి

హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం ఆపివేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్‌ని వెనక్కి తీసుకోవాలని, హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం ఆపివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐబి వద్ద ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కోసం ధర్నాలు,నిరసనలు చేయకూడదని యూనివర్సిటీ వద్ద ఎలాంటి కార్యక్రమాలు చేయవద్దని సర్క్యులర్ జారి చేయడం సిగ్గుచేటన్నారు. విశ్వవిద్యాలయాలు ఉద్యమాలకు పుట్టినిల్లు,తెలంగాణ ఉద్యమంలో క్రియ శీలకం ఉస్మానియా అలాంటి విద్యార్థి ప్రాంగణంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్ట వద్దని ఆంక్షలు విధించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. వైస్ ఛాన్సలర్ కుమార్ ఇలాంటి విధానాలను మానుకోవాలని విద్యార్థుల పక్షాన హెచ్చరించారు. అదే విధంగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం భూములను అక్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వం 400ఎకరాల యూనివర్సిటీ భూములను వేలం వేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఇలా పెట్టుబడి దారులకు అమ్ముకుంటూ పోతే రాష్ట్రానికి ఏమి మిగలదదని అలాంటి ప్రక్రియను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. యూనివర్సిటీల అభివృద్ధి అంటే విద్యార్థుల ఆస్తులను లాక్కోవడమా? ప్రశ్నించే వేదికలు ఉండకుండా వ్యవహరించడమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు హామీలను, పూర్తిగా మరిచిపోయి నేడు నిరంకుశ పాలన సాగిస్తుందన్నారు. ప్రగతి భవన్ గేట్లు కంచేలను తీసివేసిన ప్రభుత్వం నేడు విద్యార్థి ఉద్యమాల గడ్డ పైన ఆంక్షలు పెట్టి సర్క్యులర్‌ని తీసుకురావడం మూర్ఖత్వమన్నారు. యూనివర్సిటీల కు మద్దతుగా స్థానిక యూనివర్సిటీల వద్ద దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అర్జున్, రవి,మల్లేష్ ,ప్రవీణ్,ప్రేమ్,దత్తు, వంశీ, పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సెట్రల్ జీఎస్టీ అధికారి

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



సెంట్రల్ జీఎస్టీ మెదక్ రేంజ్ సూపరింటెండెంట్ సీబీఐ, ఏసీబీ అధికారులకు చిక్కారు. హైదరాబాద్‌లోని సీబీఐ, ఏసీబీ అధికారి ధనుంజయ్ బృందం శుక్రవారం మెదక్ ఆటోనగర్‌లోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జీఎస్టీ కార్యాలయంలో సూపరింటెండెంట్ రవి రంజాన్ అగర్వాల్ వినీతికి పాల్పడడంతో అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు కేంద్ర కార్యాలయం తలుపులు మూసి వేసి విచారణ చేశారు.

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి మచ్చుతునక

ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-జహీరాబాద్



ఇఫ్తార్ విందులో మతసామరస్యానికి మచ్చ తునక అని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం ఎంపీ సురేష్ షట్కార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజించి పాలించు విధానాన్ని అవలంబిస్తుంది ఇది మంచి పరిణామం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా భారతదేశం లౌకిక దేశం లౌకిక దేశంగానే ఉంటుందన్నారు. ఈ దేశంలో అన్ని మతాలకు సర్వహక్కులు ఉన్నాయి కానీ వారి హక్కులను హరించేందుకు పెద్ద మొత్తంలో కుట్ర జరగడం బాధాకరమైన విషయమన్నారు. ఎంపీ సురేష్ శెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీ మంత్రి లేకపోవడం బాధాకరమైన విషయం అయినా త్వరలోనే మైనారిటీ మంత్రిని నియమించేందుకు పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాలకు సమాన ప్రతిపాదికన గౌరవం ఇచ్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు దీనికి నిదర్శనం జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలసి పాల్గొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకోవడమేనన్నారు. నియోజకవర్గం ఇన్చార్జి మాజీమంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గం రాష్ట్రంలోనే చారిత్రాత్మకమైనటువంటి నియోజకవర్గం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, టీఎస్ ఐడీసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి , మాజీ టి ఎస్ ఐ డి సి చైర్మన్ మహమ్మద్ తన్వీర్, నాయకులు మహమ్మద్ జావీద్ ,అశోక్ అప్పారావు, శ్రీకాంత్ రెడ్డి, నాగిరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, భాస్కర్ రెడ్డి ,శుక్లవర్ధన్ రెడ్డి , ఆర్డీవో రామ్మోహన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్, తాసిల్దార్ నియోజకవర్గ మైనార్టీ సోదరులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ,మండలాల నాయకులు మరియు మాజీ యం.పి.పిలు, మాజీ జెడ్పీటీసీ లు,మాజీ మున్సిపల్ చైర్మన్ లు,మాజీ యం.పి.టి.సిలు,మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం-సికింద్రాబాద్ బస్సు ప్రారంభం

జిన్నారం-నవతెలంగాణ



మండల కేంద్రమైన జిన్నారం నుంచి సికింద్రాబాద్ వరకు నూతనంగా బస్సు సౌకర్యాన్ని కల్పించారు. విద్యార్థులు, వ్యాపారులు ప్రయాణికుల కోసం నూతన బస్సు సర్వీస్‌ను మాజీ ఎంపీపీ అధ్యక్షులు దమ్మగౌని రవీందర్ గౌడ్ ప్రత్యేక చొరవతో శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకు ప్రత్యేకంగా బస్సు సర్వీస్ ప్రారంభించినందుకు జీడిమెట్ల డిపో అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు సౌకర్యవంతంగా నూతన బస్సు సర్వీసును ప్రారంభించడం పట్ల విద్యార్థులు, వ్యాపారులు, స్థానికులు మాజీ ఎంపీపీ అధ్యక్షులు రవీందర్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కోరబోయిన నరేష్, యనగండ్ల నరేందర్ గౌడ్, మాజీ ఎంపిటిసి పుట్టి భాస్కర్, విష్ణుమూర్తి, పల్నాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాయకల్ప అవార్డు కోసం డాక్టర్ల బృందం ఆస్పత్రి తనిఖీ



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రస్థాయి కాయకల్ప డాక్టర్ల బృందం శుక్రవారం జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రినీ తనిఖీ చేశారు. మలక్ పేట్ ఏరియా హాస్పిటల్ డాక్టర్లు సురేష్, డాక్టర్ సాయికిరణ్, నర్సులు రాధా, కృపాలిని ఆసుపత్రికి వచ్చారు. జోగిపేట ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సౌజన్య వారికి కావలసిన సమాచారాన్ని అందించారు. పర్యావరణం, పారిశుధ్యం, గ్రీనరీ, అత్యధిక విభాగాల్లో వైద్య సేవలు, యంత్ర పరికరాల నిర్వహణ, ల్యాబ్ నిర్వహణ, భవన వసతి, ఆస్పత్రి పరిసర ఆవరణలో పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, నీటి వినియోగం, ఆస్పత్రి వేస్టేజ్ మేనేజ్మెంట్ నిర్వహణ తదితర అంశాలలో పరిశీలించారు. సౌకర్యాలను బట్టి కాయకల్ప అవార్డులు ఆసుపత్రికి వస్తాయని ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్. సౌజన్య తెలిపారు.

సంగారెడ్డిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

మున్సిపల్ అధికారులు మిషన్ భగీరథ సిబ్బందితో కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి



పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా, నిరంతరంగా శుద్ధమైన త్రాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లతో కలిసి పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు ముఖ్యంగా వేసవిలో నీటి ఎద్దడి సమస్య ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో నీటి అవసరాలకు అనుగుణంగా తగినన్ని వాటర్ ట్యాంకులను సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాకుండా, ప్రత్యామ్నాయ నీటి వనరులను ఉపయోగించి పట్టణం , గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించడమే కాకుండా, నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అమృత జల్ 2.0 పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో డ్రైవర్స్ కాలనీలోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ పరిశీలించారు. పట్టణ ప్రజలకు ప్రతి రోజు తాగునీరు సరఫరా చేసే విధానాన్ని , రాజంపేట ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి వాటర్ క్లీనింగ్ ప్రక్రియ, నీటి నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిక్సింగ్, క్లోరినేషన్ ప్లాంట్ల నిర్వహణపై సమగ్ర అవగాహన కలిగివుండాలన్నారు. సంగారెడ్డి పట్టణంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా వేసవి కాలంలో పట్టణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరాతో పాటు పట్టణంలోని పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ఎస్‌ఈ రఘువీర్, ఈ ఈ విజయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ఎస్‌సి వి కె చవాన్, మునిసిపల్ డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారి ఇంతియాజ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణ మోహన్, ఏఈ రఘువీర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గీతం, హైదరాబాద్ ఎంబీఏకు ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ అక్రిడిటేషన్

మూడేళ్ల పాటు, 2028 జూన్ 30 వరకు మంజూరు

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ శిఖలో మరో కలికితురాయి చేరింది. హైదరాబాద్ ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) కోర్సుకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ), న్యూఢిల్లీ మంజూరు చేసినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఈ గుర్తింపు 2028 జూన్ 30 వరకు మూడేళ్ల పాటు అమలులో ఉంటుందని తెలిపారు. డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయ హొదాను 2007లో పొందిన తరువాత గీతం అందుకున్న మొదటి ఎన్‌బీఏ అక్రిడిటేషన్ ఇదని, వర్సిటీ చరిత్రలో ఇదో మైలురాయిగా నిలిచిపోతుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ గుర్తింపు విద్యా నైపుణ్యం, బిజినెస్ మేనేజ్ మెంట్ విద్యలో ఉన్నత ప్రమాణాల పట్ల సంస్థ నిబద్ధతను నొక్కి చెబుతోందన్నారు.హైదరాబాద్ ప్రాంగణంలోని ఎంబీఏ అధ్యాపకులు, అక్రిడిటేషన్ బృందాలను ఐక్యూఏసీ, అక్రిడిటేషన్ అండ్ ర్యాంకింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.మంజునాథాచారి హృదయపూర్వకంగా అభినందించారని, వారి అవిశ్రాంతి కృషి, అంకితభావం ఈ గౌరవనీయమైన గుర్తింపును పొందడంలో కీలక పాత్ర పోషించినట్టు తెలియజేశారు. ఈ విజయం పట్ల గీతం ఉన్నత నాయకత్వం తమ హర్షాన్ని వెలిబుచ్చింది. విద్యా నైపుణ్యం, నిరంతర అభివృద్ధి పట్ల అచంచలమైన నిబద్ధతను ఈ గుర్తింపు వెల్లడిస్తోందని ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా తదితరులు అభిప్రాయపడినట్టు వివరించారు. బిజినెస్ మేనేజ్మెంట్ విద్యలో ప్రముఖ సంస్థగా గీతం స్థానాన్ని ఈ గుర్తింపు పునరుద్ఘాటిస్తోందని, జ్ఞానం, నైపుణ్యాలు, ప్రపంచ దృక్పథాలతో కూడిన భవిష్యత్ వ్యాపార నాయకులను అభివృద్ధి చేయాలనే గీతం లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గీతంలో ఉత్సాహభరితంగా 'అంతర్జాతీయ సంతోష దినోత్సవం'

అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనందాన్ని సృష్టించే (క్రాఫ్టింగ్ జాయ్) కార్యక్రమాన్ని గీతం విద్యార్థి విభాగం ఉడాన్ నిర్వహించింది. సృజనాత్మకత, చైతన్యంతో కూడిన ఉత్తేజకరమైన వేడుక కోసం విద్యార్థులను డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఒకచోట చేర్చింది. వేడుకలలో భాగంగా, ఫ్లాష్ డ్యాన్స్, బంకమట్టితో బొమ్మల తయారీతో పాటు పుస్తక పఠన కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వీయ వ్యక్తీకరణ, ఇతరులతో తమ అనుభవాలను పంచుకోవడంలో విద్యార్థులు మునిగిపోయారు. నిరాడంబరంగా నృత్యం చేయడం, సంక్లిష్టమైన బంకమట్టి నమూనాలను రూపొందించడం, సున్నితమైన కాగితపు పువ్వులను రూపొందించడం వంటి ప్రతి పని తమ సొంతం అనే భావనను, భావోద్వేగ అనుభూతిని పెంపొందించింది. ప్రశాంతమైన పుస్తకపఠన కార్యక్రమం, అందులో పాల్గొన్న వారిని ఉత్తేజితులను చేయడంతో పాటు స్ఫూర్తిదాయకంగా ఉంచింది.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డిఓ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-అమీన్ పూర్

అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ సాయి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆర్‌డీఓ రవీందర్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఆర్డీవో పరీక్ష కేంద్రంలో నిర్వహణ విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహసిల్దార్ హరిచంద్ర, రెవెన్యూ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- ఆర్డీవో రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-అమీన్ పూర్: ప్రజలు వివిధ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారని రెవిన్యూ సిబ్బంది వెంటనే స్పందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్డీవో అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్‌డీఓ ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల చివరి వరకు 25% రాయితితో కూడిన ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. సర్టిఫికెట్ కోసం వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే వాటిని పరిష్కరించాలి. తహసిల్దార్ కార్యాలయం అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రధానంగా మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడటం కోసం నిరంతరం పనిచేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించాలని ప్రయత్నిస్తే వారిపై చట్టరత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రెవిన్యూ సిబ్బంది సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇంచార్జ్ తహసిల్దార్ హరిచంద్ర, ఆర్ఐలు రఘురాం రెడ్డి, శ్రీమన్, సిబ్బంది పాల్గొన్నారు.

అందోల్‌లో ప్రశాంతంగా పరీక్షలు

నవతెలంగాణ-జోగుపేట



పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు తెలుగు మొదటి ప్రశ్నాపత్రం పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. అందోల్ మండలంలో మొత్తం 6 కేంద్రాలలో 982 మంది విద్యార్థులు పూర్తిసాయిలో హాజరయ్యారు. జోగిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ఎం, డాన్ బాస్కో, అందోల్ ప్రభుత్వ బాలుర పాఠశాల, అందోల్ గురుకుల పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను జోగిపేట ఆర్డీవో పాండు, తహసిల్దార్ విష్ణు సాగర్, ఎంఈఓ కృష్ణలు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

- మొదటిరోజు ఏడుగురు గైర్హాజరు

నవతెలంగాణ-జహీరాబాద్



పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో 2,696 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2689 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. జహీరాబాద్ మండలంలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొగుడంపల్లి మండలంలో ఒకే సెంటర్ నందు నూట అరవై ఆరు మందికిగాను 166 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు అన్ని విధాల కట్టుదిట్టమైన చర్యలను చేపట్టినట్లు ఆర్డీవో రామ్ రెడ్డి తెలిపారు. జహీరాబాద్ తహసిల్దార్ పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ

నవతెలంగాణ సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, కరుణా హై స్కూల్, సాహితీ హై స్కూల్ పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించి, అక్కడి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్షా రాయడానికి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు కనీస సదుపాయాలు, అత్యవసర మెడికల్ సేవల గురించి పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన 10వ తరగతి పరీక్షల నిర్వాహణ గైడ్ లైన్స్ పాటిస్తూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ -2023 అమలులో వుంటుందని, పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల దగ్గర ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయించామన్నారు. విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్ ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్స్ ఎవ్వరికి కూడా పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడానికి అనుమతించబడవన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లైతే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీసు వారికి సమాచారం అందించాలని సూచించారు.

సబ్సిడీపైన వ్యవసాయ పరికరాలు

నవతెలంగాణ-మనూర్



సబ్సిడీపైన రైతులకు వ్యవసాయ పరికరాలు ఇవ్వనున్నట్లు నాగల్గిద్దా మనూర్ మండలాల వ్యవసాయ అధికారులు ప్రవీణ్ చారి మహేష్ చౌహన్‌లు తెలిపారు. ఎస్సి ఎస్టీ వారికీ 50శాతం సబ్సిడీ జనరల్ మహిళలకు 40శాతంపై సబ్సిడి పరికరాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాన్నారు. రైతులు పట్టా పాస్ బుక్ ఆధార్‌కార్డు జిరాక్స్ తో పాటు పాస్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మొదటి రోజు పరీక్ష ప్రశాంతం-99.82 హాజరు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో ఎస్ఎస్సి ప్రథమ భాషా పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా విద్యాధికారి ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 22406 మంది కాగా 22366 మంది విద్యార్థులు హాజరయ్యారని 40 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు. హాజరు శాతం 99.82 ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, డైరెక్టర్ ఉన్నత విద్యాశాఖ అధికారి జి.ఉషారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ పండరి నాయక్, పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్స్ 40 మంది విధులు నిర్వహించారని తెలిపారు.

ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- కేవీపీఎస్ జిల్లా నాయకులు కొతారి నర్సింలు

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్



ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై శ్వేత పత్రం విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు కొతారి నర్సింలు డిమాండ్ చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,04,965 కోట్లతో పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రూ.40,232 కోట్లతో ఎస్సీ అభివృద్ధి ఫండ్ క్రింద కేటాయించారని, అవి కేవలం కాగితాల్లో అంకెలు పెంచుతూ ఖర్చులు తుంచుతున్నారని, ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కేటాయింపు జరగలేదన్నారు. అంబేద్కర్ అభయహస్తానికి ఏటా రూ.750 కోట్లు కేటాయించి ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయిందన్నారు. బడ్జెట్ ను వెంటనే సవరించి దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఖర్చు చేయని నిధులను సబ్ ప్లాన్ చట్టం ప్రకారంగా వచ్చే ఏడాది బడ్జెట్లో ఖర్చు చేయాలని సబ్ ప్లాన్ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. దళితుల యొక్క ఆవాసాలు, విద్యా, వైద్యం, రహదారులు, త్రాగునీరు వంటి మౌలిక ప్రత్యక్ష ప్రయోజనాలపై దృష్టి సారించలేదన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై నోడల్ ఆఫీసర్ ద్వారా ఆడిట్ చేయించాలన్నారు. సబ్ ప్లాన్ నిధులలో జవాబుదారీ తనాన్ని పెంపొందించాలన్నారు. ఎస్సీ ఎస్టీ శాఖల సంక్షేమ అభివృద్ధి పథకాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు చర్చల సందర్భంగా దళితుల, గిరిజనుల సబ్ ప్లాన్ నిధులపై ప్రత్యేక చర్చను ఏర్పాటు చేసి ఒక శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. బడ్జెట్‌పై పునరాలోచన చేసి దళిత అభివృద్ధి శాఖకు మంత్రిని నియమించాలన్నారు.

బొలెరో వాహనం బోల్తా పడి మహిళ మృత్తి

నవతెలంగాణ-రాయికోడ్



బొలెరో వాహనం బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సింగీతం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై నారాయణ తెలిపిన కథనం ప్రకారం ఈ నెల 20న ఉదయం 11:00 గంటలకు,చౌదర్ పల్లి గ్రామానికి చెందిన దొడ్ల మానెమ్మ (53) వాకిండి యశోద, మనుష, అశ్విత, హారిక, కలిసి రేగోడు గ్రామానికి చెందిన కడాల రాములు బులోరా వాహనంలో మండలంలోని హస్నాబాద్ గ్రామానికి బంధువుల తొట్టెల కార్యక్రమానికి వచ్చారు. అనంతరం కార్యక్రమం ముగించుకొని సాయంత్రం చౌదర్ పల్లి గ్రామానికి తిరుగు ప్రయాణమవుతుండగా, సాయంత్రం6:30 గంటలకు సింగీతం గ్రామ శివారులో బీటీ రోడ్డుపై డ్రైవరు అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వలన వాహనము అదుపుతప్పి ఎడమవైపు గుంతలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో దొడ్ల మానెమ్మకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు మానెమ్మ మృతి చెందారని తెలిపారు. మరణించిందని తెలిపారు. అందులో ప్రయాణిస్తున్న వారందరికీ బలమైన గాయాలు తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దొడ్ల మానెమ్మ భర్త దొడ్ల నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ నారాయణ తెలిపారు.

పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

- ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు
- ఎలాంటి అక్రమాలు అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని రిషి పబ్లిక్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తనిఖీ చేసి పదవ తరగతి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రంలో నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 122 పరీక్ష కేంద్రాలలో 22,423 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అక్రమాల అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈఓ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు ఉన్నారు.

జహీరాబాద్ ఎంఈఓపై డీఈఓకు ఫిర్యాదు

- ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ఎంఈఓ బసవరాజ్ ఆగడాలు అవినీతి రోజురోజుకు పెరిగిపోతున్నాయని పలు ఉపాధ్యాయ సంఘాలు డీఈఓకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం జహీరాబాద్ మండలంలో ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారికి ఇన్విజిలేషన్ డ్యూటీలు వేయకుండా ఇతర మండలాల్లో వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులకు తమకు అనుకూలమైనే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధికంగా ఉన్న సెంటర్లలో ఇన్విజిలేటర్లుగా వేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని డీఈఓ కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ ఎస్ సి ఇన్విజిలేషన్ డ్యూటీలు జడ్పీహెచ్ఎస్ ధనసరి నుంచి 9 మంది టీచర్లు ఉండగా ఐదుగురికి ఆల్రెడీ డ్యూటీలు ఉన్నాయి. అయినప్పటికీ 50% దాటినప్పటికీ శుక్రవారం అవసరం లేకున్నా జహీరాబాద్ ప్రైవేట్ పాఠశాలలో జడ్.పి.హెచ్.ఎస్ ధనాసిరి నుంచి మళ్లీ ఒక టీచర్‌కి జహీరాబాద్ ఎంఈఓ బసవరాజు ప్రైవేటు విద్యాసంస్థలతో అవినీతికి పాల్పడి పక్క మండలమైన మొగుడంపల్లి నుంచి ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా తీసుకుంటున్నాడని ఆరోపించారు. జహీరాబాద్ మండలంలో చేయడానికి చాలామంది ఉపాధ్యాయులు ఉన్నారని, కానీ వారికి డ్యూటీలు వేయకుండా ఇతర మండలాల నుంచి నిపుణులైన ఉపాధ్యాయులను ఎందుకు డ్యూటీలు వేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయమై విచారణ జరిపి ఎంఈఓ పై చర్య తీసుకోవాలని డీఈఓకు విజ్ఞప్తి చేసినట్లు యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామ్ తెలిపారు. గతంలో కూడా ఈ విధమైన అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఎంఈఓపై ఎన్నో ఫిర్యాదులు అందాయని ఈసారి క్షుణ్ణంగా విచారణ జరపాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోకూడదని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఎంఈఓ వివరణ

ఈ విషయమై జహీరాబాద్ ఎంఈఓ బసవరాజును వివరణ కోరగా తాను డీఈఓ ఆదేశాల మేరకు నడుచుకుంటున్నానన్నారు. తనపై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవన్నారు.

చెరకు సాగుపై మొగ్గు చూపుతున్న అన్నదాతలు

- తీపి పంటపై రైతుల ఆసక్తి
- జోరుగా చెరుకు సాగు
- వ్యవసాయంపై మరింత ఆసక్తి



నవతెలంగాణ-న్యాల్ కల్

వ్యవసాయ చెరుకు పంట సాగు 2024 -2025 సంవత్సరం చెరుకు సాగు బాగా పెరిగిందని వ్యవసాయ అధికారులు చెరుకు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సమీప చెరుకు ఫ్యాక్టరీ మాటూర్ శివారులో గోదావరి గంగా అగ్రో ప్రొడక్ట్స్ షుగర్ ఫ్యాక్టరీ ఉండడంతో దాదాపు రైతులు చెరుకు సాగుపై మరింత ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ రైతులు వ్యవసాయంపై రైతులు చెరుకు సాగు చేస్తున్నారు. న్యాల్ కల్, మామిడిగి, మెటల్ కుంట, రేజింతల్, హద్నూర్, మిర్జాపూర్ (బి) గుంజేటి, ముంగి, ఆయా గ్రామాల్లో వ్యవసాయ పంటలో చెరుకు సాగు ప్రధాన పంటను ఆశాజనకంగా పంట సాగుకు మొగ్గు చూపారు. రైతులు పొలాల్లో నాగలి, రోటవేటర్, దుక్కులు దున్నే పనిలో రైతులు బిజీ అయ్యారు. చెరుకు సాగుకు పొలాన్ని ట్రాక్టర్లతో దుక్కి దున్నడం, సేంద్రియ ఎరువులను వేయడం వంటివి సాగుకు పనులు చేస్తున్నారు. 2024-25లో మండలంలో 631.15 ఎకరాల చెరకు పంట సాగు అయిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. చెరుకు పంట సాగుకు ఎకరానికి ట్రాక్టర్ దుక్కి దున్నడం, చెరుకు విత్తనం, ఎరువులు, పురుగు మందు పిచికారి, కలుపు మొత్తం కలిపి సుమారు 45 వేల వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని రైతులు పేర్కొన్నారు. పెట్టుబడుల ఖర్చులు పెరిగిపోయాయని తెలిపారు. చెరుకు పంట ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంతో రైతులు తీపి పంటపై ఆసక్తి చూపుతున్నారు . గత సంవత్సరం కంటే 2025 సంవత్సరం చెరకు సాగు జోరందుకుంది .

వ్యవసాయ చెరుకు పంట 6 ఎకరాలు సాగు చేశాను. ఇతర పంటల కన్నా చెరుకు ఆశాజనకంగా పంట ఉంటుంది. సమీప మాటూర్ శివారులో గోదావరి గంగా అగ్రో షుగర్ ఫ్యాక్టరీ ఉండడంతో చెరుకు పంటపై ఆసక్తి పెంచాము. వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు జాగ్రత్తలు పాటిస్తూ చెరుకు సాగు చేస్తున్నామని రైతు సతీష్ పాటిల్ పేర్కొన్నారు. ఆధునిక పద్ధతులు పాటిస్తున్నాం సాగుకు పెట్టుబడులు పెరిగాయి.



రైతు సతీష్ పాటిల్ , న్యామత బాద్

బిఆర్ఎస్ విధానాలనే అవలంభిస్తున్న కాంగ్రెస్

- అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు
- సమస్యలు పరిష్కారం చేయమంటే అరెస్టు చేస్తారా
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-సదాశివపేట

బిఆర్ఎస్ విధానాలనే కాంగ్రెస్ పప్రభుత్వం అవలంభిస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అన్నరు. అసంఘటితరంగ కార్మికులైన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిర్వహిస్తున్న ఛలో హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అని పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే అవలంబిస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కార్మికుల గురించి అడిగితే పోలీసులను పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తామంటే చలో హైదరాబాద్ వెళ్తామంటే ఇంటిదగ్గర ఉదయం ఆరు గంటలకు వచ్చి అరెస్టు చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులను తక్షణమే విడుదల చేయాలని, అసంఘటితరంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో డివైఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పది పరీక్షలకు మొదటిరోజు 100% హాజరు

నవతెలంగాణ-ఝరాసంగం



పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ఝరాసంగం మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఝరాసంగం మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఝరాసంగం మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 174 మంది విద్యార్థులకుగాను 100% మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. అదేవిధంగా తెలంగాణ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 226 మంది విద్యార్థులకుగాను అందరూ హాజరై పరీక్షలను ప్రశాంతంగా రాశారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షల్లో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకుండా సంబంధిత అధికారులు మౌలిక వసతులు, తగిన ఏర్పాట్లు చేశారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు 144వ సెక్షన్ అమలు చేయడంతో పాటు పరీక్షలు జరుగుతున్న సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

వనంపల్లిలో తాగునీటి సమస్య

నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండలంలోని వనంపల్లిలో తాగునీటి సమస్య తలెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ఎండలు తీవ్ర రూపం దాల్చకముందే ఈ గ్రామంలో గల రక్షిత మంచినీటి పథకం బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోవటంతో తాగునీటి సమస్య వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో రెండు బోర్లు ఉండగా వీటిలో కేవలం గంటసేపు మాత్రమే సరిపడు నీళ్లు వస్తున్నాయని, అనంతరం గ్యాప్ వస్తున్నట్లు ప్రజలు వాపోయారు. దీంతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లోకి సరిపడు నీళ్లు చేరకపోవడంతో నిండడం లేదని వారు తెలిపారు. తాగు నీటి సమస్య మరింత జఠిలం కాకముందే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు

ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

- ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలి
- ఆశ వర్కర్స్ పనిభారం తగ్గించాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆత్మకూర్, సదాశివపేట
- పీఎస్‌సీ ముందు ధర్నా
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్





నవతెలంగాణ-సదాశివపేట/మునిపల్లి

పెరిగిన ధరలకనుగుణంగా ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ , ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సదాశివపేట, ఆత్మకూర్ పీహెచ్‌సిల ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం మండల వైద్యాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సంద్భంబగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలు నుంచి పనిచేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని డిమాండ్ చేశారు.ఆశ వర్కర్ల పైన పని భారం తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్స్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆశా వర్కర్స్ గురించి కనీసం రాష్ట్ర ప్రభుత్వం ఊసు కూడా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్స్‌కు వేతనాలు పెంచుతామని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచిపోయినా వారి గురించి మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. చాలీచాలని జీతాలతో అధునపు పని భారంతో పని ఒత్తిడితో తీవ్రమైన సమస్యలు ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్లో ఆశా వర్కర్లకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు యశోద, లావణ్య, స్వరూప, మాధవి, యాదమ్మ శ్రీవాణి, స్వప్న, అనసూయ, బాలామణి, మంజుల, మల్లేశ్వరి, నాగరాణి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- సమస్యలు పరిష్కారం చేయమంటే అరెస్టు చేస్తారా
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి



నవతెలంగాణ-సంగారెడ్డి

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, అసంఘటితరంగా కార్మికుల సమస్యలు పరిష్కారం చేయమంటే అరెస్టు చేస్తారా అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి మండిపడ్డారు. శుక్రవారం అసంఘటితరంగా కార్మికులకు సమస్యలు పరిష్కారం చేయమంటూ శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న నాయకులను, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం, మేము ఇచ్చిన ప్రతి మాటను అమలు చేస్తాం, మాది ప్రజా ప్రభుత్వం, మేము పాలకులం కాదు, సేవకులమని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటతప్పిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయమంటే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి నేటికీ 15 నెలలు దాటినా అతీ గతి లేదన్నారు. రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులు నిర్వీర్యమై ప్రస్తుతం కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ శ్రమ జీవుల కడుపులు కొడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను ఎండగడుతూ అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాల అమలుకై పోరాటం నిర్వహిస్తామన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- డిఎస్పి రామ్మోహన్ రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ డివిజన్ పరిధిలో జాతీయ రహదారి 65 పై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కొన్ని స్పాట్లను గుర్తించినట్లు డిఎస్పి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. జహీరాబాద్ సిఐ శివలింగం రూరల్ సీఐ హనుమంతుతో కలసి జాతీయ రహదారిపై ఉన్న ప్రమాదకర మూలమలుపులను పరిశీలించి నివేదికలు తయారు చేసి ఆర్ అండ్ బి అధికారులకు పంఎనున్నట్లు తెలిపారు. మరో దఫా ఆర్ అండ్ బి అధికారులతో జాతీయ రహదారి అధికారులతో కలసి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవల్సిన సూచనలు సలహాలను పాటించే ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. జహీరాబాద్ పట్టణంలో ప్రధాన విధులలో ఉన్న చౌరస్తాల వద్ద స్పీడ్ బ్రేకర్లను, ప్రమాద సూచికలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ నియమ నిబంధనలను విధించడంతో ప్రమాదాలను నివారించేందుకు, ట్రాఫిక్ సమస్యను చెక్ పెట్టినట్లు అయిందని తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారిపై కూడా అవలంబించేందుకు పలుచోట్ల డ్రమ్ములను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ రాత్రి వేళల్లో శరవేగంగా వస్తున్న వాహనదారులు డ్రమ్ములను సైతం ఢీకొట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రమ్ములకు బదులుగా ప్రత్యేక ఏర్పాట్లను చేసేందుకు వివిధ శాఖల అధికారులతో సమాలోచన చేసి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు పార్కింగ్ విధానాన్ని ఏర్పాటు చేయడంతో చాలావరకు ప్రమాదాలను ట్రాఫిక్ సమస్యలను నివారించగలిగిగామన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లంగిస్తున్న వారిపై సీసీ కెమెరాల ఆధారంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు .ఇప్పటికే జహీరాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రయాణికులకు తెలియపరచడం జరుగుతుందన్నారు. అయినప్పటికీ ఎవరైనా నిబంధనలను అధిగమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలన్నారు.

చేనేత కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 3 సంవత్సరాల చేనేత, టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సుల్లో మొదటి సంవత్సరం 2025-26 ప్రవేశం పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు హెచ్. వెంకట రావు తెలిపారు. పదవ తరగతి లేదా సమాన పరీక్షల్లో ఉత్తరులై, జూలై 1 2025 నాటికి 23 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని ఎస్సీ, ఎస్టీ లకు 25 ఏళ్ల వరకు అనుమతి ఉందన్నారు మూడేళ్ల పాటు ఆరు సెమిస్టర్లు ఉంటాయని, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఏప్రిల్ 2025 మొదటి వారంలోగా హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న కొండ లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు పూర్తి వివరాలకు ఓఎస్‌డి. హిమజా కుమార్ ఫోన్ నెంబర్ 9030079242 కు సంప్రదించాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని షౌకత్ పల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నార్లాపూర్ తాజా మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శౌకత్ పల్లి అంతర్గత రోడ్ల అభివృద్ధి కోసం రూ.20 లక్షలను మంజూరు చేశారు. షౌకత్ పల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాల్య నాయక్, సుర రాములు, సూర్య నాయక్, రాజు నాయక్, వార్డ్ మెంబెర్ మంజుల బోయిని, నాగరాజు, బాలయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు

ఎండిన వంటలకు పరిహారం చెల్లించాలి



నవతెలంగాణ-పాపన్నపేట

ఎండిన వరి వంటలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఎం మండల నాయకులు అశోక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బాచారం గ్రామంలో వంటలను శుక్రవారం పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ మండుతున్న ఎండలతో, బోరు బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి. దీంతో చేతి కొచ్చిన వంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఎండిన పంటలకు ఎకరారు రూ.40 వేల పరిహారం చెల్లించాలన్నారు. రైతుల బాధ్యత పూర్తిగా ప్రభుత్వ తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళన చెందొద్దన్నారు.

పిల్లుట్లలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-శివ్వంపేట



ఆపదలో ఉన్న ప్రతి బాధిత కుటుంబాన్ని తనవంతు సహకారం అందించి తప్పకుండ ఆదుకుంటానని సామాజిక సేవదాత నీలం మధు ముది రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ఇటీవలే మరణించిన దాసరి మొగులయ్య కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గ్రామ నాయకులచే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు మరింత సహకారం అందించడమే తన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తున్న ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలం మధు సేవా సంఘం సభ్యులు జనుముల గణేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పెద్దపులి యాదగిరి, గుర్రాల సాయిలు, బోను లింగం, గుర్రాల శంకర్, దాసరి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామాయంపేట

పాము కాటుతో మృతి చెందిన వడ్ల సుశీల కుటుంబానికి సానుభూతిగా స్థానికులు, స్థానిక నాయకులు ముందుకు వచ్చారు. రామాయంపేట మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, పెర్క రాజు రూ.5000 చొప్పున మొత్తంగా రూ.10,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానికుల మరి కొందరు తమ వంతుగా సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుశీల మరణం బాధాకరమని, ఆమె కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, మున్సిపల్ అధికారులు కూడా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉపశమనం కల్గించిన వర్షం

నవతెలంగాణ-నార్సింగి



గత కొద్ది రోజులుగా మండల వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు పెరిగి ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండలు తీవ్రంగా కాస్తూ మార్చి నెలలోనే, మే నెలను తలపిస్తూ భయ పెడుతున్నాయి. పగటి పూట బయటకు వెళ్ళాలన్నా జంకే పరిస్థితులు కనబడుతున్నాయి. ఎండ, వేడి తీవ్రత తో సతమత మవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తూ శుక్రవారం వర్షం కురిసింది. వాతావరణం మధ్యాహ్నం నుంచే చల్లగా మారి సాయంత్రం దాదాపు 5 గంటల నుంచి ఉరుములు మెరపులతో చిన్నగా మొదలయిన వాన క్రమంగా పెరుగుతూ వాతావరణాన్ని చల్ల బడేలా చేసింది. వేడితో ఉపశమనం పొందిన జనానికి తోడు, అకాల వర్షం కురవడంతో పొట్ట దశలో ఉండి సాగు నీరు లేక వరి పంటలు ఎండి పోతున్న దశలో కురిసిన వర్షానికి పంటలకు మేలు జరుగుతుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన



నవతెలంగాణ-చేగుంట

పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆదుకో వడమే తమ లక్ష్యమని మండల మాజీ ఎంపీపీ మసుల శ్రీనివాస్ పేర్కొన్నారు. చేగుంట పట్టణ కేంద్రంలో ఇటీవల మృతి చెందిన గ్రామపంచాయతీ సఫాయి కార్మికుడు రమేష్ మృతి చెందిన విషయం తెలుసుకొని శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, భాస్కర్, అమర్నాథ్, జనార్ధన్ గౌడ్, శీను తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ప్రతిష్టకు పీఏసీఎస్ చైర్మెన్ విరాళం



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని చిన్నగొట్టి ముక్కుల గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కోసం, కో ఆపరే టివ్ బ్యాంకు చైర్మెన్ కొంతన్ పల్లి చింతల వెంకట్రాంరెడ్డి రూ.20 వేల విరాళాన్ని శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, అందుకు నిర్వాహకులకు మరింత సహకారం తప్పకుండా అందజేస్తానన్నారు. అడిగిన వెంటనే కాదనకుండా విరాళాన్ని అందించిన వెంకట్రాంరెడ్డికి శివాజీ యూత్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ



నవతెలంగాణ-నార్సింగి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల తెలుగు అధ్యాపకుడు కిషన్ పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో టీచర్ తన ఔదార్యాన్ని చూపుతూ 100 మంది విద్యార్థులకు ప్యాడ్లు అందించారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ మురళీ మోహన్ ఉపాధ్యాయుడిని అభినందించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పరీక్షలలో రాణించాలని, ఉన్నత ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయుడు కిషన్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, దీప, పల్లవి, రామకృష్ణ, వేంకటేశ్వర శర్మ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కార్ అంటేనే మోసం

- మెదక్ మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆరేళ్ల మల్లిఖార్జున గౌడ్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ సర్కార్ అంటేనే మోసమని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆరేళ్ల మల్లిఖార్జున్ గౌడ్ అన్నారు. మచ్చలేని మనిషి, నీతి నిజాయితీకి మారుపేరు అయిన హరీశ్ రావు మీద అక్రమ కేసు పెట్టడం ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శన మన్నారు. నేర చరిత్ర కలిగిన చక్రధర్ గౌడ్ పిర్యాదుని తీసుకొని కేసు నమోదు చేయడం, దానికి పోలీసులు అత్యుత్సాహం చూపెట్టి అబాసు పాలవ్వడమే కాకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపైనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, హరీష్ రావు లాంటి నాయకులే తెలంగాణకి శ్రీరామ రక్ష అని యావత్ ప్రజానీకం భావిస్తుందన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి
- అరెస్టులు ఇందిరమ్మ రాజ్యమా అని మండిపాటు



నవతెలంగాణ-శివ్వంపేట

కార్మికుల హక్కులను, హామీలను అమలు చేయమంటే పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయిస్తున్న ప్రభుత్వం ఉద్యమాలను ఆపాలనుకోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి అన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఏ ప్రభుత్వము కూడ ఆపలేదని మహేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రవాణా రంగ కార్మికులకు, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. శివ్వంపేట పోలీస్ స్టేషన్‌లో మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పాలకులం కాదు మేము.. సేవకులం అని ఎన్నికలలో కాంగ్రెస్ సర్కార్ హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత అన్నిరంగాలకు అన్యాయం చేస్తూ కాలం వెళ్ళదీస్తోందని ఆయన మండిపడ్డారు. శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న నాయకులకు అరెస్టు చేయడమేంటని ఆయన మండిపడ్డారు. అక్రమంగా అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులను ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హైదర్ చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలి

- నర్లాపూర్ రైతులు

నవతెలంగాణ-నిజాంపేట



హైదర్ చెరువు ఆయకట్టు రైతులకు పంటలు ఎండిపోకుండా తగిన న్యాయం జరిగేలా చూడాలని మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామ రైతులు స్థానిక డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మల్లన్న సాగర్ కాల్వ నుంచీక్ష్మ హైదర్ చెరువుకు నీరు రావడంలేదని చెరువులో ఉన్న నీరు హైదర్ చెరువు కింద ఆయకట్టు రైతులకు నీరు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో ఉన్న నీరును కొందరు వారి సొంత భూమి లేకున్నా గాని కౌలుకు తీసుకొని జెసిబి ద్వారా చెరువులో కాలువలు తీసి నీరును తీసుకొని పోయి మోటార్ల ద్వారా వారి పొలాలకు నీటిని తరలించకపోతున్నారని, ఎలాగైనా వారి మోటార్లను బంద్ చేసి చెరువు ఆయకట్టు రైతులకు నీరు అందించే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార్లాపూర్ ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

23న సిద్దిపేటలో జాబ్ మేళా

నవతెలంగాణ-సిద్దిపేట :సిద్దిపేట నియోజకవర్గ నిరుద్యోగ యువతి (మహిళ)ల కోసం ఈ నెల 23న విపంచి కళా నిలయంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజక వర్గం లోని మహిళల కోసం హైదరాబాద్ లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ క్యూస్ విన్నింగ్ టుగేధర్ వారి సౌజన్యం తో సిద్దిపేటలో నిర్వస్తు న్నట్లు తెలిపారు. 18 సం॥ వయస్సు పై బడిన మహిళలు, అర్హత 10, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ జాబ్ మేళా లో సెలక్షన్ అయిన మహిళలకు 15 రోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చి జాబ్ లో తీసుకుంటారని చెప్పారు. నియోజకవర్గ పరిసరా ప్రాంతం లోని నిరుద్యోగ యువతి (మహిళలు) లు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రీకాంత్, రమేష్, లింగం, సతీష్, ప్రశాంత్ తదిత రులు పాల్గొన్నారు.

పదో పరీక్షలు తొలిరోజు ప్రశాంతం

నవతెలంగాణ-శివ్వంపేట



పదో తరగతి వార్షిక పరీక్షలకు తొలిరోజు శుక్రవారం మండలం లోని విద్యార్థులందరు హుషారుగా హాజరయ్యారు. ఉదయం 9:30 లకు పరీక్షలకు హాజరు కావలిసిన విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు రావడం కనిపించింది. మండలంలోని దొంతి, చెంది, గోమారం, శివ్వంపేట ఉన్నత పాఠశాలలలో మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాలకు విచ్చేసిన విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి బుచ్చ నాయక్ తెలిపారు. మండలంలోని పిల్లుట్ల, రత్నాపూర్, కొంతన్ పల్లి, పాంబండ, దొంతి, చెంది, గోమారం, పెద్ద గొట్టిముక్కుల, చిన్గొట్టిముక్కుల, కస్తూర్ బా గాంధీ పాఠశాలల నుంచి 524 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు.

చల్మెడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభ

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. చల్మెడ గ్రామంలో సీసీ లేకుండా గల్లీలలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా వెంటనే స్పందించి సీసీ రోడ్ల కోసం నిధులను మంజూరు చేశారు. నిధులను మంజూరు చేసినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అక్క పల్లి రామిరెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్ బాజ రమేష్, ముత్యం రెడ్డి, అబ్బా రెడ్డి, యాదవ రెడ్డి, గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరానికి అనూహ్య స్పందన

- ఎంపీడీవో కృష్ణమూర్తి

నవతెలంగాణ-మనోహరాబాద్



గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణ కోసం రెడ్ క్రాస్ సొసైటీ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని మనోహరాబాద్ ఎంపీడీవో కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ శాఖ, విఎస్‌టి ఇండస్ట్రీస్ సహకారంతో మల్లారెడ్డి హాస్పిటల్ సూరారం సౌజన్యంతో కొండాపూర్ గ్రామంలోనీ గ్రామ పంచాయతీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ ఆరోగ్య శిబిరమును ఎంపీడీవో కృష్ణమూర్తి ప్రారంభించారు. గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఆరోగ్య శిబిరంలను నిర్వహిస్తూ పేదలకు సేవలు అందించడం పట్ల ఎంపీడీవో హర్షం వ్యక్తం చేశారు జిల్లా ఉప వైద్యాధికారి జ్ఞానేశ్వర్, మనోహరాబాద్ తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సిహెచ్ ఓ బాల నరసయ్య, విఎస్‌టి కంపెనీ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ గోపికృష్ణ తదితరులు వైద్య శిబిరాన్ని సందర్శించారు. మల్లారెడ్డి హాస్పిటల్ ప్రత్యేక వైద్య బృందం గ్రామానికి చేరుకొని ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించింది. అంతేకాకుండా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య పరీక్షల్లో సుమారు 170 మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు మణికంఠ, ఖ్యాతి, సంజన, రాకేష్ దంత పరీక్షలు నిర్వహించారు, సాయికిరణ్, యశస్వినిలు నరాలకు సంబంధించిన కీళ్ల నొప్పులు, దగ్గు ,దమ్ము రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా చైర్మన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర సభ్యులు సింగం శ్రీనివాసరావు, కార్యదర్శి టి.సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి.శ్రీనివాస శర్మ, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు పి.దామోదర్ రావు, గ్రామానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు తొలి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా ఒకటే పరీక్షా కేంద్రాన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతంలో బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్‌ను అమలు పరుస్తూ తన సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం 8:30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. శుక్రవారం జరిగిన మొదటి పరీక్షకు 100 శాతం విద్యార్థులు హాజరు అయ్యాని, నార్సింగి ఉన్నత పాఠశాలకు చెందిన 105 మంది, శేరిపల్లి పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. పరీక్షా సమయంలో మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో జరుగుతున్న పరీక్షా సరళిని స్థానిక తహశీల్దార్ షేక్ కరీం పరిశీలించారు. పరీక్షా సరళి, వసతుల కల్పనపై షేక్ కరీం సంతృప్తిని వ్యక్తం చేశారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కారం చేస్తాం

- డీబ్ల్యుఓ హైమావతి

నవతెలంగాణ-మనోహరాబాద్



మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీడబ్ల్యుఓ హైమావతి పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలో ఐటిసి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మెదక్ డీడబ్ల్యుఓ హైమావతి, నర్సాపూర్ సిడిపిఓ హేమా భార్గవిలు పాల్గొన్నారు. మండలంలోని మనోహరాబాద్, కొండాపూర్ గ్రామాలలో ఐటిసి సంస్థ అంగనవాడీ భవనాలను నిర్మించడం జరిగిందన్నారు. కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్స్, వాటర్ కలెక్షన్ వాష్ స్టేషన్ కాంపౌండ్ వాల్ పెయింటింగ్స్ నిర్మించారు. అంగన్వాడీ టీచర్లను ఇంకా ఎక్కడైనా భవన సమస్యలు గానీ వాటర్ సమస్యలు టాయిలెట్స్ వాష్ ఏరియా బేబీ టాయిలెట్స్ కావాలని అడిగి తెలుసుకున్నారు. న్యూట్రిగార్డెన్స్ కూడా కొత్తగా నిర్మించడానికి కూడా ప్రయత్నం చేస్తామని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను కూడా ఇప్పిస్తామని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో ఉన్న భవన సమస్యల గురించి టీచర్లు వారికి తెలియచేశారు. త్వరలోనే టీచర్లు తెలియజేసిన సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

పంట ఎండిపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్య యాదవ్



నవతెలంగాణ-శివ్వంపేట

యాసంగి వరి పంటలను సాగుచేసి పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకోవాలని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో మండలంలో పాంబండ, ఉసిరిక పల్లి శంకర్ తండాలలో ఎండిపోయిన పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అంతం గారి వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి నర్సారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ జిల్లా కార్యవర్గ కమిటీ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా కార్యవర్గ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 20 మంది రైతుల పొలాలు పరిశీలించడం జరిగిందన్నారు. రైతులు వ్యవసాయ మీదనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఒక ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి పెట్టి, చేతికి వచ్చిన పంట ఎండిపోవడంతో రైతులు బిక్కుబిక్కుమని ఏడుస్తున్నారని ఆవేదన చెందారు. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. 10 ఎకరాల వరకు రైతుకు రైతు భరోసా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదు

- కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి



కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అడ్డు తగలడం మంచి పద్ధతి కాదన్నారు. అభివృద్ధికి సహకరించాల్సిన ఎమ్మెల్యే రాజకీయ స్వార్థంతో పనులను అడ్డుకోవడం ధారుణమన్నారు. ప్రజల సౌకర్యార్థం సేహగల్ స్వచ్ఛంద సంస్థ నియోజకవర్గంలో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తుంటే ప్రోటోకాల్ పేరిట నియోజకవర్గంలోని అధికారులపై బెదిరింపులకు దిగడం శోచనీయమన్నారు. ముఖ్యంగా అన్నదాతలను దృష్టిలో ఉంచుకొని వాగులపై చెక్ డ్యాం, చెరువులు, కుంటల్లో, పూడికతీత పనులు కట్టవెడల్పు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల రక్షణ కోసం పాఠశాలలో ప్రహరీలు సేహగల్ స్వచ్ఛంద సంస్థ చేపడుతుంటే వాటిని అడ్డుకోవడానికి ఎమ్మెల్యే ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమన్నారు. చేతనైతే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ అభివృద్ధి పనులను అడ్డుకోవద్దన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన వైఖరి మార్చుకొని స్వచ్ఛందంగా అభివృద్ధి పనులకు సహకరించాలని లేనిపక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

ధనలక్ష్మి మాత ఆలయ అభివృద్ధికి మరింత కృషి

నవతెలంగాణ-శివ్వంపేట



మండల కేంద్రమైన శివ్వంపేటలోని శ్రీధనలక్ష్మి మాత ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త అన్నారు. ధనలక్ష్మి మాత జాతర ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అంతకు ముందు గౌడ సంఘం జిల్లా నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ జంగం విజయ వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాసంపల్లి శ్రీనివాస్ గౌడ్, మంతూరి రమేష్ గౌడ్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు కాముని నగేష్, వజ్జ శ్రీనివాస్, ఇసుగారి అరుణ్, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిథులను జాతర నిర్వాహకులు ఇసుగారి పెద్ద నర్సయ్య ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నవతెలంగాణ-తూప్రాన్



ప్రభుత్వ పాఠశాలలోనే మంచి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్య మైన విద్యా బోధన చేయడం జరుగు తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ పేర్కొన్నారు. తూప్రాన్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ గ్రామీణ సాక్షరత మిషన్ భారత్ సర్కారు వారి సహకా రంతో శుక్రవారం 1వ తరగతి విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, ఉపకార వేతనాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్తు హై స్కూల్ లో పదవ తరగతి పరీక్షలు శుక్రవారం 9 : 30 నిమిషాలకు ప్రారంభమయ్యాయి. నస్కల్, రాంపూర్, కల్వకుంట, నార్లాపూర్, నందిగామ, గ్రామాలలో మొత్తం 144 మంది విద్యార్థులకుగాను ఒకరు గైర్హాజరు కాగా, 143 మంది పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాధికారి సొంగని యాదగిరి తెలిపారు.

శ్రీ అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



మెదక్ పట్టణం 13వ వార్డ్ ద్వారకా నగర్ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ స్వామిని మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే యం.పద్మదేవేందర్ రెడ్డి శుక్రవారం స్వామివారిని దర్శించుకున్నారు. తన మనవడు సుహాన్స్ రెడ్డి రెండవ జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభయానికి మారుపేరుగా నిలిచే ఆంజనేయస్వామి ఆరాధ్య దైవమన్నారు. ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులతో మెదక్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, తాజా మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి, మెదక్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్లు సులోచన ప్రభు రెడ్డి, అకిరెడ్డి కృష్ణ రెడ్డి, మామిళ్ళ. ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
4
శనివారం | 22 మార్చి 2025 | www.navatelangana.com

ముదిరాజులకు అడుగడుగునా అన్యాయమే



- రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్

నవతెలంగాణ-సిద్దిపేట

మత్స్య శాఖకు సరిపడా బడ్జెట్ కేటాయించకపోవడం సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజులను విస్మరించడమేనని, ముదిరాజులకు అడుగడుగునా అన్యాయమే జరుగుతుందని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ సర్కిల్లో ప్రభుత్వంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముదిరాజులను చిన్నచూపు చూస్తున్నారని, బీసీ-డీ నుండి బీసీ -ఏ లోకి మారుస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడిచిన నేటికి హామీ నెరవేర్చలేదని అన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల్ని ఇస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ పథకాన్ని తీసేసి ముదిరాజులకు అన్యాయం చేసిందన్నారు. ఇప్పటికైనా హామీ నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఆగస్టు 15 లోపు ముదిరాజులకు మంత్రి పదవి ఇస్తానన్న హామీ ఏమైందని రేవంత్ రెడ్డి నీ మాటలు అన్నీ గాలి మాటలేనా అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడికాయల వెంకటేశం, తోట్ల పరశురాములు, పడిగె ప్రశాంత్, ఇట్టబోయిన శ్రీనివాస్, పెండెల బాలయ్య, టైగర్ సత్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి 'నూజివీడు' ఎంతో తోడ్పాటు



నవతెలంగాణ-తొగుట: రైతుల ఆర్థిక అభివృద్ధికి నూజివీడు విత్తనాలు ఎంతో తోడ్పడుతాయని రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో రైతు కిషన్ సాగుచేసిన నూజివీడు విన్నర్ ఎస్ఎంహెచ్ 8352 మొక్కజొన్న పంట క్షేత్రాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా రైతులకు నూజివీడు విత్తనా లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం అధునాతమైన ఆధునీక సాంకేతిక పరిజ్ఞానంతో మేలైన రకాలతో రైతులకు అందిస్తున్నామన్నారు. నూజివీడు మొక్కజొన్న గాలికి, వర్షానికి భూమిపై వాలిపోకుండా నిటారుగా ఉంటుందన్నారు. కంకి చివరి వరకు మొక్క జొన్న విత్తనాలు ఉంటాయన్నారు. పంట చేను నలుమూలల ఒకే విధానంగా పైరు ఉంటుందని తెలిపారు. ఇలాంటి మేలైన నూజివీడు విన్నర్ మొక్కజొన్న విత్తనాలు సాగు చేసి రైతుల అధిక దిగుబడి పొందాలని సూచించారు. దాదా పు 200 మంది రైతులు పాల్గొన్నారు. లక్ష్మీ రైతు సేవా కేంద్రం సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకన కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సిద్దిపేట

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమవుతుందని మూల్యాంకన కేంద్రం కన్వీనర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తెలుగు, పొలిటికల్ సైన్స్, గణితం, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులకు సంబంధించిన ఎగ్జామినర్లు సకాలంలో క్యాంపు కార్యాల యంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ ఆయా సబ్జెక్టుల అధ్యాపకులను రిలీవ్ చేయాలని సూచించారు. మూల్యాంకన విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి





నవతెలంగాణ-సిద్దిపేట

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పదో తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య హై స్కూల్, ఎస్ఆర్కే డిజి హై స్కూల్, పొరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ప్రశ్న పత్రాలు ఎన్ని గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరాయి, ఏమైనా సమస్యలు ఉన్నాయా, హాజరు శాతం తదితరు వివరాలను పరీక్షల నిర్వహణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు, విద్యుత్, సెక్యూరిటీ, ఫర్నిచర్, మెడికల్ క్యాంపు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం అయినందున పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో చల్లని త్రాగునీరు, ఫ్యాను, ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు అవసరమైన ఔషధాలు, మరుగుదొడ్లు తదితర అన్ని సౌకర్యాలను సమకూర్చాలని, ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి ఉన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజున 14114 మంది విద్యార్థులకు 14101 మంది విద్యార్థులు హాజరు కాగా, 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99.91 శాతం హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి, 144 సెక్షన్‌ను అమలుపరిచారు. పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధ, అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిలు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడ కూడా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడు బృందాలు పలు సెంటర్లను తనిఖీలు చేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- జిల్లా కలెక్టర్ మనూ చౌదరి



నవతెలంగాణ-కొండపాక

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కొండపా కలోని ఆనంద నిలయమును సందర్శించారు. ముందుగా ఆనంద నిలయం సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని చేరుకోగా ఆలయ పూజారులు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు శాలువా, పూలదండతో జిల్లా కలెక్టర్‌ను సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆనంద నిలయంలో ఆవాసం ఉంటున్న వృద్ధుల గదులను, పరిసరాలను, వసతులను, డైనింగ్ హాల్‌ను పరిశీలించి వృద్ధులతో సంభాషించి వారు ఆనంద నిలయంలో పొందుతున్న సౌకర్యాలు గురించి అడిగితెలుసుకున్నారు. ఆనంద నిర్లయంలోని బాలసధనంలో చిన్నారులు ఉండడానికి గల సౌకర్యాలను పరిశీలించి చిన్నారులతో సంభాషించి వారు భవిష్యత్తులో ఏం కావాలో అడిగి తెలుసుకుని భవిష్యత్తులో ఏ ఏ రంగాల్లో విజయం సాధించాలన్న ఇప్పటినుంచి కష్టపడి చదవాలన్నారు. క్రమశిక్షణ పాటిస్తూ వార్తాపత్రికల పఠనం చేయాలన్నారు, కంప్యూటర్ నాలెడ్జ్ పెంచుకోవాలని అన్నారు. ఒక కంప్యూటర్ ను విద్యార్థులకు అందిస్తానని తెలిపారు. ప్రధాన రహదారి నుండి ఆనంద నిలయం వరకు రోడ్డు నిర్మించాలని ట్రస్ట్ సభ్యులు కోరడంతో తాత్కాలిక గ్రావెల్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఈఈ గజ్వేల్ చిరంజీవికి సూచించారు. ఈ కార్యక్రమంలో కొండపాక తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంపీడీవో, ఆనంద నిలయం ట్రస్టు సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో (సీఐటీయూ) ఆటో డ్రైవర్ల కార్మిక సంఘం సచివాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో మద్దూరు పోలీసులు ఆటో డ్రైవర్ల యూనియన్ సంఘం అధ్య క్షుడు కొమురవెల్లి కనకయ్య, ఉపాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. వెంటనే ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో హమాలీ కార్మికుడు ఆత్మహత్య



నవతెలంగాణ-వర్గల్

అప్పుల బాధతో హమాలీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వర్గల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కిష్టనోళ్ళ నర్సింలు (58) హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత సంవత్సరం వారి కుమార్తె వివాహం కోసం రూ.పది లక్షలు అప్పు చేసాడు. ఇటీవల తన కాలికి గాయం కావడంతో అతనికి కూలి దొరకడం లేదు. రోజు ఇంటివద్దే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. తన భార్య మద్యం సేవించడం మానమని మందలించడంతో కోపంతో గురువారం ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. తాను కౌలుకు తీసుకున్న పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శవపరిక్ష నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అండాళు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గౌరారం ఎస్సై కారుణకర్ రెడ్డి తెలిపారు

డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ ఫారెస్ట్ డే



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ ఫారెస్ట్ డేను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి ఆధ్వర్యంలో అడవుల ప్రాముఖ్యతపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ॥ అనిత అబ్రహం అధ్యక్షత వహించారు. అడవుల సంరక్షణ మన సమాజానికి, ప్రకృతికి మానవజాతికి ఎంత ప్రధానమో ఈ సందర్భంగా అనిత అబ్రహం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రఘువీర్ రిటైర్డ్ ఐఎఫ్ఎస్ హాజరై మాట్లాడుతూ.. అడవులు ఆక్సిజన్ సరఫరాకు, వాయు కాలుష్యం తగ్గించుటకు, జల వనరులను పర్యవేక్షించేందుకు, అనేక వన్యప్రా ణులకు ఆధారాన్ని కల్పిస్తూ కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపల్ కమల క్రిస్టియన్, పి శ్రీలత, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి జయరాజు, టీఎస్ కే సి కోఆర్డినేటర్ డాక్టర్ జె ఉమా రాణి, డాక్టర్ ఏ బాలచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్‌ని వెనక్కి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను



నవతెలంగాణ-సిద్ధిపేట

ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు, నిరసనలు చేయవద్దని యూనివ ర్సిటీ సర్క్యులర్ జారీ చేయ డాన్ని ఎస్ఎఫ్ఐ ఖండిస్తుందని, వెంటనే సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అభిషేక్ భాను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం యూనివర్సిటీ భూములను వేలం వెయ్యడానికి ప్రయత్నిస్తుందని, దాన్ని వ్యతిరేకి స్తూ విద్యార్థి సంఘాలు ధర్నాలు చేస్తున్నాయన్నారు. విద్యార్థుల మధ్య ఐక్యమత్యాన్ని తగ్గించాలని, ధర్నాలను చేయించకూడదని ప్రభు త్వ ఒత్తిడితో యూనివర్సిటీ వారు సర్క్యులర్ తీసుకొచ్చారన్నారు. సమస్యల పరిష్కారానికి ధర్నాలు, నిరసనలు, యూనివర్సిటీ వద్ద ఎలాంటి కార్యక్రమాలు చేయ్యొద్దని సర్క్యులర్ జారీ చేయడం సిగ్గుచేటన్నారు. విశ్వవిద్యాలయలు ఉద్యమాలకు పుట్టినిల్లని, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకమైన ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టొద్దు అని ఆంక్షలు విధించడం సరికాదన్నారు. వైస్ ఛాన్సలర్ కుమార్ ఇలాంటి విధానాలను మానుకోవాలని విద్యార్థుల పక్షాన హెచ్చరించారు. అదే విధంగా హైదరాబాద్ విశ్వవి ద్యాలయంలోని 400ఎకరాల యూనివర్సిటీ భూములను వేలం వేయడం రేవం త్ రెడ్డి ప్రభుత్వం ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముత్యం వెంకటేశ్వర్లు, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి





నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తునికి మహేష్ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు గత ఆరు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి సంవత్సర కాలం పూర్తి అయినప్పటికి పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల వలే గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, వేతనాల చెల్లించుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మార్చి 25న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్దఎత్తున కదిలించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్ర మంలో నరేష్, బాలు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నంగునూరు మండల ప్రధాన కార్యదర్శి చిట్యాల కనకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) మండల కమిటీ నాయకులు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు లేక నానా తంటాలు పడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పకుండా ప్రతినెల ఒకటో తారీకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, 51 రద్దు చేయాలని, జీవో నెంబర్ 60 అమలు చేస్తూ కేటగిరి వారిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమంలో రాష్ట్ర నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్న దాని తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రెండు మూడు రోజుల్లో పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేస్తూ గ్రీన్ ఛానల్ ధర వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు దేవులపల్లి రాజమౌళి, ఉపాధ్యక్షుడు పిల్లి రవీందర్, ఉపాధ్యక్షురాలు జీడికంటి కనకవ్వ, కార్యదర్శి బిళ్ళం బాలయ్య, అంకని పర్శ రాములు, కనకయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించండి

- అధికారులైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టండి
- 3వ, 4వ, 15వ, 16వ వార్డు సభ్యులు కమిషన్‌కి వినతి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

పదేళ్ల తర్వాత మళ్లీ నీటి కష్టాలు మొదలయ్యాయని, ప్రత్యామ్నాయ చర్యలతో నీటి ఎద్దడిని నివారించి, ప్రజల దాహార్తిని తీర్చాలని ప్రజ్ఞాపూర్ బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యని కలిశారు. శుక్రవారం 3వ, 4వ, 15వ, 16వ వార్డుల సభ్యులు కమిషన్ ఆఫీస్‌లో మూడో వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. గత ప్రభుత్వంలో నీటి ఎద్దడి అంటే ఎలా ఉంటుందో తెలియకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ పనికి వచ్చే పనులను వదిలి పనికిమాలిన పనుల్లో నిమగ్నమైందన్నారు. వెంటనే అధికారులు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే నీటి కోసం కోటి తిప్పలు అనే సామెత మళ్లీ పునరావృ తమవుతుందన్నారు. ప్రజలు నీరు లేక బిందెలతో రోడ్లపైకి వచ్చే కాలం అతి సమీపంలోనే ఉన్నట్లుగా కనిపిస్తుం దన్నారు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని నీటి కష్టాలను రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ అధ్యక్షులు ఎక్కల దేవి కనకరాజు యాదవ్, 16 వార్డ్ అధ్యక్షులు డాకని బిక్షపతి, నాయకులు మన్నే వెంకటేష్, సాయిబాబా, పాల్గొన్నారు.

గుర్తుకులంలో కృత్రిమ మేధపై జాతీయ సదస్సు

నవతెలంగాణ-వర్గల్

మండలకేంద్రంలోని మహాత్మజ్యోతి బాపూలే మహిళ గురుకులంలో కృత్రిమ మేధ అంశంపై జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సదస్సు ముఖ్య లక్ష్యం "అడ్వాన్స్ టెక్నాలజీ" ని రూపొందించడం. ఈ కార్యక్రమానికి గురుకుల జాయింట్ సెక్రెటరీ శ్యామ్ ప్రసాద్ లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. ఏఐ వలన కలిగే లాభ నష్టాలను గురించి విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఈ సదస్సుకు విశ్వేశ్వరయ్య యూనివర్సిటి చెన్నై, శ్రీ నిధి యూనివర్సిటీ ఘట్కేసర్, సిటీ కాలేజ్, అరోరా కాలేజ్, మహాత్మ గాంధీ యూనివర్సిటీ నల్గొండ, కాకతీయ యూనివర్సిటీ వరంగల్, జేఎన్టీయూ హైదరాబాద్, మొదలగు కళాశాల నుంచి విద్యార్థులు హాజరై పరిశోధన పత్రలను సమర్పించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థుల పరిశోధన పత్రాలను పుస్తంకంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్ రావు, వైస్ ప్రిన్సిపల్ గోవింద రావు, ఉమామహేశ్వరి, కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి నిఖిత, రాధా రాణి, అనిత, అధ్యాపక బృందం, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి



నవతెలంగాణ-నంగునూరు

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి తెలిపారు. శుక్రవారం మండలంలోని బద్దిపడగ గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తప్పెట శంకర్‌లతో కలిసి భూమి పూజా చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణలు మంజూరు చేయించిన నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి రమేశ్, నాయకులు చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, రాగుల కనకయ్య, చేర్యాల బాలయ్య నీల రమేశ్, డబ్బెట మహేశ్, రేణుక, తారవ్వ, మణెవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పోస్టులు భర్తీకి ప్రతిపాదన



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లాలోని ఏరియా ఆసుపత్రిలో పోస్టులు భర్తీ చేస్తామని డిస్టిక్ హాస్పిటల్ సూపరెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆమె మాట్లాడుతూ.. దుబ్బాక గైనకాలజీ, జీడీఎం రెండు పోస్టులు ఉన్నాయి. నంగునూరుఆర్థోపెటిక్, గజ్వేల్ ఆసుపత్రిలో జీడీఎంఓ ఒక్క పోస్టు ఉండగా చేర్యాలలో రెండు పోస్టులు ఉన్నా యన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో తీసుకుంటామన్నారు. పీజీ, డిగ్రీ, ఎంబీబీఎస్, డిగ్రీ తప్పనిసరిగా ఉండాలన్నారు. అదేవిధంగా తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు కలిగి ఉండాలని గరిష్ట వయసు 44 సంవత్సరాలు మించొద్దు అన్నారు. ఈనెల 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు.

హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి



నవతెలంగాణ-మర్కుక్

ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కలు కొందరి నిర్లక్ష్యం మూలంగా అగ్నికి ఆహుతవుతున్నాయి. మండలం లోని చేబర్తి నుండి మర్కుక్, దామరకుంట, శివారులో రోడ్డు కిరువైపులా నాగేళ్ళ కిందట నాటిన మొక్కలు ఇటీవల మంటల్లో కాలిపోయాయి. పిచ్చిమొక్కలతో పాటు మొక్కలు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. వందల మీటర్ల పొడవునా మొక్కలు దగ్ధ మయ్యాయి. మొక్కలు కాలిపోయిన పది రోజులు దాటుతున్న, మొక్కలు కాలిపోయిన విషయం అధికారులకు తెల్సిన ఇప్పటికీ వరకు నీళ్ళు పొయ్యకపోవటం గమనార్హం.

కేసీఆర్ అవినీతి, అక్రమాలపై సర్కార్ దర్యాప్తు చేయాలి

- ప్రజా సమస్యలపై మాట్లాడని కేసీఆర్‌ను గవర్నర్ బర్తరఫ్ చేయాలి
- కాంగ్రెస్ పోరు బాటలో సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దర్యాప్తు చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండని, అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంతో గవర్నర్ వెంటనే బర్తరఫ్ చేయాలని సిద్దిపేట డీసీసీఅధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం పోరు బాటలో భాగంగా కోడకండ్లలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పట్టని, మల్లన్న సాగర్ నిర్వాసితులను నిండా ముంచిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పడమే ఈ పోరుబాట లక్ష్యంమన్నారు. భారీ కార్యకర్తల ర్యాలీతో పోరుబాట చేపట్టినట్లు స్పష్టం చేశారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తకుండా కేసీఆర్ తప్పించుకు తిరుగుతున్నట్లు ఎద్దేవా చేశారు. గజ్వేల్ లో కమిషన్లు వచ్చే భవన నిర్మాణాలు తప్ప పేదలకు ప్రయోజనం జరిగే పనులేమీ లేవని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంక్షారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొనగారి రాజు, కార్యదర్శి రాములు గౌడ్, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



నవతెలంగాణ-రాయపోల్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్ర గాయాలైన వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామ పరిధిలోని గుర్రాలసోఫా వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. మెదక్ జిల్లా చేగుంట మండలం కసాన్ పల్లి గ్రామానికి చెందిన లింగ రమేష్ (39) వ్యవసాయం, సెంట్రింగ్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. గురువారం గజ్వేల్ పట్టణానికి సెంట్రింగ్ కూలి పనికి తన ద్విచక్ర వాహనంపై వెళ్లి, తిరిగి తన ఇంటికి వెళ్లే క్రమంలో రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామ పరిధిలోని గుర్రాలసోఫా సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రమేష్ తీవ్ర గాయా లపాలయ్యాడు. వెంటనే హుటాహుటిన చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ పరిశీలించిన వైద్యులు రమేష్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడి భార్య లింగ లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపారు.

మహిళా సంఘ సభ్యులకు అవగాహన

నవతెలంగాణ-కొండపాక

సమాజంలో జరుగుతున్నటువంటి మానవ అక్రమ రవాణాపై, లైంగిక వేధింపులపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిద్దిపేట వారి సహకారంతో ఉమెన్ ట్రాఫికింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం కొండపాక రైతు వేదికలో మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం ముగ్దుమ్ అలీ మానవ అక్రమ రవాణాపై, లైంగిక వేధింపులపై సినిమా ద్వారా డెమో ఇచ్చారు. కుకునూరుపల్లి ఎంపీడీవో రాంప్రసాద్ ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశానికి మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత అధ్యక్షత వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

మానవ అక్రమ రవాణా జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఏపీఎం డాకయ్య అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండల సమైక్య ఆధ్వర్యంలో మహిళలకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులతో పాటు బలవంతంగా వివాహం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. మహిళల పట్ల, బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన వారిని బలవంతంగా ఇబ్బంది పెట్టిన వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు. ఎవరైనా బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించి వారిపై దాడికి పాల్పడితే వెంటనే ,100, 111, 108, 1930 పోలీస్ స్టేషన్కు సమాచారం అందించి వారిపై చర్యలు తీసుకునే విధంగా చూడాలని తెలిపారు. మహిళలకు మహిళా హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించి ఆన్లైన్ మోసం ఎలా జరుగుతున్నాయో వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ప్రశాంతి ,అశ్విని, గౌతమి, సీసీలు బాలరాజు, వైకుంఠం ప్రభాకర్, దేవదాస్, సిద్ధిరాములు, శ్రీనివాస్, అకౌంటెంట్ శారద, తదితరులు పాల్గొన్నారు.





ధర్మారం పంచాయతీ కార్యదర్శి పై ఎంపీడీవో కు ఫిర్యాదు



నవతెలంగాణ-మద్దూరు

ధర్మారం పంచాయతీ కార్యదర్శి అశోక్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో రామ్మోహన్‌కు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొంగరం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ప్రజలకు ఉండడం లేదని తెలిపారు. చెత్త సేకరణ చేయక రెండు నెలలు గడుస్తుందని దీంతో పారిశుధ్యం కుంటుపడిందని ఆరోపించారు. గ్రామంలో వీధిలైట్లు వేయాలని నల్ల లీకేజీలు చేయించాలని కార్యదర్శులు కోరడంతో గ్రామపంచాయతీలో డబ్బులు లేవని నువ్వే చేయాలని చెప్పడంతో తన సొంత ఖర్చులతో వీధిలైట్లు వేయించానని గ్రామపంచాయతీ పనులు చేయించిన డబ్బులు ఇవ్వడంలేదని ఆరోపించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి అశోక్, పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

-మున్సిపల్ చైర్ పర్సన్ మంజులరాజనర్సు



నవతెలంగాణ-సిద్దిపేట

వేసవికాలంలో పాదచారుల, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి మున్సిపల్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పాత బస్ స్టాండ్, రైతు బజారు, ప్రభుత్వ దవాఖాన వద్ద సందీప్ హాస్పిటల్, అవి ఫర్టిలిటీ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవికాలంలో ఎండ దెబ్బ తగలకుండా ఎక్కువ శాతం నీరు తీసుకోవాలని, తప్పనిసరి అయితేనే తప్ప బయటకు రావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, ఎడ్ల అరవింద్ రెడ్డి, సాయి కుమార్, దుద్దెడ మాజీ సర్పంచ్ మాంచాల శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించిన సీఐ



నవతెలంగాణ-రాయపోల్

కొండపోచమ్మ ప్రాజెక్టు కాలువ ద్వారా వచ్చే నీరు రాయపోల్ మండలంలోని ముంగిసపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామ రైతుల మధ్య ఎల్లమ్మ చెరువు నీటి విషయంలో వివాదం నెలకొంది. రైతుల పంటలు ఎండిపోకూడదని అట్టి విషయంలో తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్సై రఘుపతి పోలీస్ సిబ్బందితో గ్రామాలను సందర్శించి ఇరు గ్రామాల రైతులతో మాట్లాడి, నీటిపారుదల అధికారులను సంప్రదించి లింగారెడ్డిపల్లి గ్రామ రైతులకు వ్యవసాయానికి నీళ్ల వచ్చేవిధంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోరు కానీ వివాదాలతోటి సమస్యలు పరిష్కారం కావన్నారు. ముంగిస్ పల్లి, లింగారెడ్డి పల్లి గ్రామాల రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయం కోసం ఇరు గ్రామాలకు సాగునీరు అందించేందుకు నీటిపారుగాల శాఖ అధికారులు కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముంగిస్ పల్లి, లింగారెడ్డి పల్లి రైతులు, పోలీస్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో సదుపాయాలు ఏర్పాటుచేయాలి : సీఐ



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని పరీక్ష కేంద్రాల నిర్వహకులకు గజ్వేల్ సీఐ బి.సైదా ఆదేశించారు. శుక్రవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ సైదా మాట్లాడుతూ.. మండల పరిధిలో పదో తరగతి రాస్తున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పామన్నారు. అంతేకాకుండా పరీక్ష కేంద్రాల వద్దకు ఆలస్యం కాకుండా సకాలంలో హాజరై ఎగ్జామ్ రాయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

సర్ సివి.రామన్‌లో అంతర్జాతీయ అటవీ దినోత్సవం

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

అంతర్జాతీయ అటవీ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని సర్ సీవి రామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వృక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల మొక్కలను పాఠశాల ఆవరణలో నాటి, వాటికి రక్షబంధాన్ని కట్టారు. "వృక్షో రక్షతి రక్షిత్" అన్న సూక్తిని గ్రహించి మనము చెట్లను నాటి, రక్షించి పెంచినట్లయితే అవి మనల్ని పర్యావరణాన్ని కాపాడుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణ రెడ్డి అన్నారు. చెట్లను పెంచడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. విద్యార్థులు తమ పుట్టినరోజు సందర్భంగా ఒక చెట్టును నాటినట్లయితే అది ఎంతోమందికి నీడనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై 18వ వార్డులో ఇంటింటి సర్వే



నవతెలంగాణ-సిద్దిపేట

18వ వార్డులో రూబెల్లా వ్యాధి (జ్వరంతో దద్దుర్లు, రాషెస్ రావడం) వంటి లక్షణాలు కనిపిస్తున్న వారి ఇంటికి వెళ్లి వైద్య సిబ్బంది సర్వే చేస్తున్నారని వార్డు బీఆర్ఎస్ నాయకులు అడ్డగట్ల శేఖర్, అంజీలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఆ వ్యాధి ఇతరులకు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడం గురించి 13 మంది ఆశా కార్యకర్తలు వార్డులో ప్రచారం చేశారని, ఇంటింటి సర్వే చేసి సూచనలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాణిక్యం, ఏఎన్ఎం సంతోషి, అనసూయ, షాహిన్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్, ముఖ్యఅతిథిగా హాజరై చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరరాజు, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పనిముట్లు

నవతెలంగాణ-కోహెడ

మండలంలోని మహిళా రైతులందరికి వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా ఎస్ఎంఏఎం పథకం నుంచి రాయితీపై పనిముట్లు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సతీష్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళా రైతులకు 50 శాతం రాయితీతో బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, రోటోవేటర్స్, కల్టివేటర్స్, సీడ్‌కం ఫర్టిలైజర్ డ్రిల్ లాంటి పరికరాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు పత్రం, భూమిపాస్‌బుక్, ఆధార్ అలాగే ట్రాక్టర్ సంబంధిత వస్తువులకు ట్రాక్టర్ ఆర్‌సీ జతపరిచి రైతు వేదిక కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్హులైన రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.

నూతన ముదిరాజ్ సొసైటీ చైర్మెన్, వైస్ చైర్మెన్‌కి సన్మానం



నవతెలంగాణ-తొగుట

మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ముదిరాజ్ సొసైటీ చైర్మెన్‌గా నూతనంగా ఎన్నికైన కత్తుల నరేష్, వైస్ చైర్మెన్ నాగులపల్లి నర్సింలును యువజన నాయకులు బండారు రమేష్ గౌడ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తిప్పరమైన స్వామి, కంక ణాల బాలకృష్ణ, మిద్దె రాజు, మిద్దె లక్ష్మణ్, గడ్డ మిది భిక్షపతి, పిట్ల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళకు అపూర్వ స్పందన

నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక ప్రభుత్వ మహిళ కళాశాలలో మెగా జాబ్ మేళాను కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ జాబ్ మేళా నందు నిరుద్యోగులు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా నందు సుమారుగా 11 వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. టెక్ మహేంద్ర, ముత్తూట్ ఫైనాన్స్, ఎల్ఐసి, శ్రీరామ్ ఫైనాన్స్, అపోలో జీపీతో, హెచ్‌డిఎఫ్‌సి, బ్యాంక్ యాక్షన్, ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్, స్వాన్ బిజినెస్ సర్వీసెస్, చెందిన ప్రతినిధులు విద్యార్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ శ్రీమతి కమల క్రిస్టియాన,శ్రీలత, ఐ క్యుఏసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి, ప్లేస్మెంట్ సెల్ కమిటీ సభ్యులు డాక్టర్ ఏ బాలచంద్రం, డాక్టర్ జె ఉమారాణి, డాక్టర్ ఏ వేణు, తదితరులు పాల్గొన్నారు. సుమారు 70 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక కాగా, సుమారు 118 మంది విద్యార్థులు ఇతర ఉద్యోగాలలో షార్ట్ లిస్ట్ అయ్యారు.

నిండుకుండలా.. చెరువులు కుంటలు





- కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి జలశయాలకు నీరు
- సిద్దిపేట జిల్లాలో పంటలకు ఊరట

నవతెలంగాణ-గజ్వేల్, నర్సాపూర్, సిద్ధిపేట, బెజ్జంకి

ఒకప్పుడు నీటి చుక్కకు కష్టంగా ఉండేది. చెరువు, కుంటల్లో వర్షాలు పడితేనే నీరు కనిపించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిందని చెప్పాలి. కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగమైన సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయాలతో రైతులకు, ప్రజలకు నీటి ఊరట కలిగింది. ప్రస్తుతం గజ్వేల్ నుంచి రామాయంపేట వెళ్లే కెనాల్ వెంబడి పరిశీలిస్తే.. 75 చెరువులు ఇప్పుడు నిండుకుండలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊట చెరువు, సంగాపూర్ సమీపంలో ఉన్న బడే చెరువు నిండుకుండలా కనిపిస్తున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో వర్గల్, గజ్వేల్, రామాయంపేట, రాయపోల్, నిజాంపేట్, దౌల్తాబాద్, చేగుంట తదితర మండలాల్లో రామాయంపేట కెనాల్ ద్వారా 75 చెరువులు నిండుతూ వస్తున్నాయి. మరికొన్నిచోట్ల కాల్వ ద్వారా నిండుతున్నాయి. గజ్వేల్ మండలంలో మొత్తం 164 చెరువులు ఉండగా 14 చెక్‌డ్యామ్‌లున్నాయి. వీటి ద్వారా 800 ఎకరాల సాగు కొనసాగుతుంది. ఒక్క పాండవుల చెరువు కిందనే 250 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. గురువారం నవతెలంగాణ విలేఖరి ఊట చెరువును పరిశీలించగా నిండుకుండలా కనిపించింది. ప్రస్తుతం దీనిపై 20 ఎకరాలు మాత్రమే అన్నాయి. కానీ భూగర్భజలాలు పెరుగుతున్నాయి. బడే చెరువు సైతం 20 ఎకరాలకు పైగానే సాగులో ఉంది. వేసవి ఎండలు 38 డిగ్రీల ఉష్ణోగ్రతలో సైతం చెరువులు నిండుకుండలా కనిపించడంతో వాటి కింద సాగు చేస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాలువలు తీసిందని, వాటివల్ల ప్రస్తుతం ఈ ఫలితాలు లభిస్తున్నాయని కాంగ్రెస్ నేతలు

అన్ని చెరువుల్లో సమృద్ధిగా నీరు..



రామాయంపేట కెనాల్ పరిధిలో 75 చెరువుల్లో నీరు చేరుతుంది. దాని కింద ఉన్న భూముల్లో వరి ఇతర పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారు. కొండపోచమ్మ జలాశయం ద్వారా రామాయంపేట కెనాల్ నీటిని పంపడం వల్ల ఇది సాధ్యమైంది.

-డీఈ పవన్ కుమార్

సుమారు 500 ఎకరాలకు సాగునీరందిస్తున్నాం..

తోటపల్లి ఆన్ లైన్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 0.32 టీఎంసీల సామర్థ్యం.ప్రస్తుతం 0.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది.మండలంతో పాటు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో ఆయా గ్రామాలకు సుమారు 500 ఎకరాల పంటలకు సాగు నీరు అందిస్తున్నాం.ఈ యేడు పంటల సాగుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో సాగునీరందిస్తాం.

-మహేందర్, ఏఈ తోటపల్లి ఆన్ లైన్ జలాశయం

రంగనాయక సాగర్ ప్రాజెక్టులో 2.06 టీఎంసీల నీటి మట్టం

మూడు టీఎంసీల రంగనాయక సాగర్‌లో గురువారం ప్రాజెక్టులో 2.06 టీఎంసీల నీటిమట్టం వరకు నీరు ఉన్నాదిని ఇరిగేషన్ ఈఈ గోపాలకష్ణ తెలిపారు. వివిధ చెరువులను నింపడానికి నీటిని ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ నుంచి నీటిని పంపిస్తున్నాము. రంగనాయక సాగర్లోకి పంపింగు బంద్ అయింది. ఇక్కడ నిల్వచేసిన నీటిని ఏప్రిల్ చివరి వరకు నీటి విడుదల చేయడం జరుగుతుంది. పంటలను రక్షించడానికి నీటిని పంపిణీ చేస్తున్నాము. ప్రస్తుతము ఇక్కడ ఉన్న నీటిమట్టం పంటలు పండడానికి సరిపోతుంది.

ఇరిగేషన్ ఈఈ గోపాలకష్ణ , సిద్దిపేట

చెరువుల్లో అంతంత మాత్రమే నీళ్లు



నర్సాపూర్ నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ పరిధిలోని నర్సాపూర్, శివంపేట్ మండలాలు వస్తాయి అని డి ఈ బుజ్జి బాబు తెలిపారు. నర్సాపూర్ మండలంలో 190 చెరువు కుంటలు , శివంపేట మండలంలో 192 చెరువు కుంటలు ఉన్నాయి. అయితే ఈసారి సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో అనేక చెరువుల్లో అంతంత మాత్రమే నీళ్ల ఉన్నాయని అన్నారు. రానున్న రోజుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్ల సైతం అడుగంటిపోయే అవకాశం ఉందని తెలిపారు. చెరువు నీళ్లపై ఆధారపడి ఆయకట్టు కింద వేసిన పంటలు కొన్ని రోజుల తర్వాత పంటలకు నీరు అందడం కష్టమేనని అన్నారు. కట్టు బందు కింద వేసుకున్నట్లయితే కొన్ని చెరువుల కింద వేసిన పంటలు కొంతవరకు పారే అవకాశం ఉందని ఆయన తెలిపారు.. ఎండలు రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతున్నందున బోరు బావుల వద్ద వేసిన పంటలు సైతం కొన్ని గ్రామాలలో నీరు పారక ఎండిపోతున్నాయి. ఆయా గ్రామాల చెరువులను సందర్శించగా అంతంత మాత్రమే నీళ్ల ఉన్నాయి.

-డిఈ బుజ్జి బాబు

సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం కోర్టు నిర్మాణం

- ప్రభుత్వ కార్యాలయాలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం
- జిల్లా కలెక్టర్ మనూ చౌదరి



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాకలో నూతనంగా నిర్మించనున్న కోర్టు భవనాన్ని సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం నాణ్యత ప్రమాణాలు, అన్ని సౌకర్యాలతో నిర్మిస్తామని, అందుకు ప్రస్తుతం ఇక్కడున్న ప్రభుత్వ కార్యాలయాలకు ఇబ్బందుల్లేకుండా కోర్టు కాంప్లెక్స్ బిల్డింగ్, రెసిడెన్షియల్ క్వార్టర్స్ నిర్మాణం చేపడతామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని కోర్టు ప్రాంగణం, ఎంపీడీవో, ఐసీడీఎస్, ఎంఆర్సీ, మున్సిపల్, పాత సీహెచ్‌సీ ఖాళీ స్థలాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు కమిటీ గైడ్ లైన్స్ ప్రకారం నూతన కోర్టు కాంప్లెక్స్ భవనం, రెసిడెన్షియల్ క్వార్టర్స్‌ల నిర్మాణానికి 4 ఎకరాల స్థలం కావాల్సి ఉండగా ప్రస్తుతం ఒక ఎకరా 32 1/2 గంటల భూసేకరణ చేశామన్నారు. ఇంకా ఎంత భూమి కావాలి..? ఎక్కడ అందుబాటులో ఉందనేది రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన పూర్తి నక్షతో కూడిన డిజైన్‌ను వారంలోగా సిద్ధం చేయాలని ఆర్డీవో సదానందం, ఆర్అండ్ బీ డీఈ వెంకటేశంను ఆదేశించారు. త్వరలోనే కావలసిన భూసేకరణ చేసి కోర్టు పనులను ప్రారంభిస్తామన్నారు. వారి వెంట జిల్లా కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ రవీందర్, ఎమ్మార్వో సంజీవ్ కుమార్, ఎంపీడీవో భాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్టీఓ సుధాకర్,ఎస్ఐ గంగరాజు,దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీఎస్ బాపూరావు, పలువురు న్యాయవాదులు,కోర్టు సూపరింటేడెంట్ సోమశేఖర్, కోర్టు, మున్సిపల్,రెవెన్యూ,పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎన్‌హెచ్ఎంను రెగ్యులరైజ్ చేయాలి

- బడ్జెట్లో నిధులను కేటాయించాలి
- ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి- జీ.భాస్కర్



నవతెలంగాణ-దుబ్బాక

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) పథకాన్ని రెగ్యులరైజేషన్ చేసి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను పెంచాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల్లో పనిచేస్తున్న ఆశా కార్మికులను ఉద్యోగులుగా, కార్మికులుగా గుర్తించాలన్నారు. పై డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు శుక్రవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్, రామక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం జీ.భాస్కర్ మాట్లడుతూ.. దేశంలో జాతీయ ఆరోగ్య మిషన్ స్టీరింగ్ గ్రూప్ దేశంలోని ఆశా కార్మికులు చేస్తున్న వివిధ పనులకు ప్రోత్సాహకాలను పెంచడానికి ఆమోదం తెలిపిన ఈ కేంద్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 10,09,000 మంది ఆశా కార్యకర్తలు అందరూ మహిళలు, నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలిపారు. ఆశాలకు సామాజిక భద్రత, ఆరోగ్య బీమా, చివరికి ప్రసూతి సెలవులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. 45 వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్సీ) సిఫారసు ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాలు నెలకు రూ.26వేలుగా పెంచాలని, ఆశా వర్కర్లను గ్రేడ్-3 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ,20 రోజుల క్యాజువల్ సెలవులు,వైద్య సెలవులను తప్పనిసరిగా ఇవ్వాల ని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ అమలు చేసి సీనియారిటీ ప్రాతిపదికన ఆశా వర్కర్లకు పదోన్నతి కల్పించాలన్నారు. ఆశా వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనియెడల పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, శ్యామల, భారత మ్మ, అనిత, లత, శారద, సంతోష, చంద్రకళ, బాబాయి, శోభ, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ స్థల వివాదంలో మంత్రిపై అసత్య ఆరోపణలు

- జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం స్థల వివాదం విషయంలో కొందరు వ్యక్తులు మంత్రి పొన్నం ప్రభాకర్ పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 265 సర్వే నెంబర్‌లో నాలుగు ఎకరాల నాలుగు గుంటల భూమి శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి సంబంధించిందని, 264 సర్వే నెంబర్‌లో గల 4 ఎకరాల 8 గుంటల భూమి ప్రయివేట్ వ్యక్తులకు సంబంధించిందని తెలిపారు. కాగితాల ప్రకారం ఎల్లమ్మ టెంపుల్ ఉన్న నాలుగు ఎకరాల నాలుగు గుంటల భూమి కంటే ఒక ఇంచు భూమి ఎక్కువగా ఉన్న సదరు వ్యక్తులు ఆ భూమిని తీసుకోవచ్చని పేర్కొన్నారు. భూమి వివాద విషయంలో కోర్టుకు వెళ్లిన వ్యక్తులు కోర్టు తీర్పు వచ్చేదాకా ఆగకుండా మీడియాలో అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. భూ పహానిలో ముగ్గురి పేర్లు ఉండటంతో 2005 వ సంవత్సరంలో అప్పటి ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి ఆ ముగ్గురు వ్యక్తుల నుండి దాన పత్రాలు రాయించుకోని భూమిని పూర్తిగా దేవాలయం పేరు మీద చేయడం జరిగిందన్నారు. భూ వివాద విషయంలో స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ పై బురదల్లే ప్రయత్నం చేయడం మానుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని మీడియా మిత్రులు, మేధావులు, ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండారెడ్డిపల్లిలో సిద్ధప్ప వరకవి వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-కోహెడ

ప్రముఖ గోల్కొండ కవి, తెలంగాణ తొలి సమాజ వేదాంత కవి సిద్ధప్ప వరకవి 41వ వర్ధంతి వేడుకలు శుక్రవారం తన స్వగ్రామం గుండారెడ్డిపల్లిలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తన భక్తులు స్వగ్రామంలోని ఆశ్రమంలో గల సమాధి వద్ద పూజలు నిర్వహించి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిద్ధప్ప వరకవి రాసిన తత్వాలు, పద్యాలను పాడి స్మరించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిద్ధప్ప వరకవి కుమారుడు అనంతవరం మాణిక్య లింగం, మనుమడు సిద్ధిరామప్ప, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలో పాములపర్తి, మర్కుక్, చేబర్తి, దామరకుంట, కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల ఉండగా వీటిలో 243 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 138 మంది, పాములపర్తి105 మంది విద్యార్థులకు 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మర్కుక్ కేంద్రంలో విద్యార్థులు అందరూ హజరైయ్యారు. పాములపర్తిలో కేంద్రంలో 105 మందికి 104 మంది హజరైయ్యారని, ఒక్కరు గైహజరైయ్యారని ఎంఈవో వెంకటరాములు తెలిపారు.

నవతెలంగాణ-గజ్వేల్ : శుక్రవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. గజ్వేల్ పట్టణంలో 8 సెంటర్లను ఏర్పాటు చేయగా1590 విద్యార్థులకి 1588 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటుతోపాటు పరీక్ష కేంద్రాల వద్ద వైద్యశాఖ, తాగునీటి సౌకర్యాలు పరీక్ష కేంద్రాల వద్ద కల్పించారు. పరీక్షకు కేంద్రాలకు ఉదయమే విద్యార్థిని విద్యార్థులు చేరుకున్నారు.

నవతెలంగాణ-కొండపాక : పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని కొండపాక ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, దుద్దెడ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో 580 విద్యార్థులకు మొత్తం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.విదార్థులకు ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు.



నవతెలంగాణ-దుబ్బాక: శుక్రవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు ఎంఈఓ జోగు ప్రభుదాస్ తెలిపారు. దుబ్బాక పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 257 మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 260 మంది, మున్సిపల్ పరిధి లచ్చపేట వార్డులోని మోడల్ స్కూల్లో 236 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 105 మంది కలిపి మొత్తంగా 859 మంది విద్యార్థులకు ఒక్కరు మాత్రమే గైర్హాజరైనట్లు ఎంఈఓ వెల్లడించారు.



నవతెలంగాణ-రాయపోల్: మండలంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం మొదటి రజు ప్రశాంతంగా నిర్వహించామని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బేగంపేట్ పరీక్ష కేంద్రంలో 204 మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హాజర్ అయ్యారు. రాయపోల్ పరీక్ష కేంద్రంలో 207 మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హాజరయ్యారు. 2 కేంద్రాలలో కలిపి 409 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలలో మంచినీటి వసతి, విద్యుత్ ,ఫర్నిచర్, మెడికల్ బృందాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ వారు పర్యవేక్షణ చేపట్టనున్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ మండలంలో శుక్రవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనాయి. పరీక్ష రాసేందుకు విద్యార్థులు ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చారు. దీంతో విద్యార్థుల్లో ఎలాంటి భయాందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లారు. హుస్నాబాద్ పట్టణంలోని బాలుర ఉన్నత , బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, జిల్లాలగడ్డ లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. హుస్నాబాద్ లో 853 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో పదవ తరగతి పరీక్షల రాసేందుకు హాజరయ్యారు. హుస్నాబాద్ లో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఎంఈఓ మనీల పర్యవేక్షణ చేశారు. నాలుగు పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల హాజరు, ఎలాంటి సమస్య లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టారు.

నవతెలంగాణ-నంగునూరు : పదో తరగతి పరీక్షలకు వంద శాతం హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు. శుక్రవారం నంగునూరు మండలంలోని పది పాఠశాలలకు రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నంగునూరు హైస్కూల్ సెంటర్ లో 212 మంది విద్యార్థులకు 212 మంది హాజరయ్యారు. అలాగే రాజగోపాల్‌పేట హైస్కూల్ సెంటర్‌లో 156 మంది విద్యార్థులకు 156 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

నవతెలంగాణ-కొండపాక : విద్యార్థులను వార్షిక పరీక్షలకు సంసిద్ధులను చేయాలని కుకునూరుపల్లి మండల ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మండలంలోని బొబ్బాయిపల్లి, ఎల్లాయిగూడ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిలబస్ పూర్తి కావడంతో త్వరలోనే వార్షిక పరీక్షలు జరగనున్నాయని వాటికి విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రతిరోజు ప్రాక్టీస్ చేస్తూ అన్ని అంశాలు వచ్చే విధంగా చూడాలన్నారు. అలాగే ఈ నెల 31లోపు ఎఫ్ఎల్ఎన్ ఎండ్ లైన్ పరీక్షలు పూర్తిచేసి అప్లోడ్ చేయాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-నంగునూరు

మండలంలో రాజగోపాల్ పేట గ్రామంలోని రైతుల పొలాలకు కాళేశ్వరం నీళ్లు కాలువల ద్వారా రావడంతో హర్షం వ్యక్తం చేస్తు మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. రంగనాయక సాగర్ నుంచి రాజగోపాల్ పేట పెద్ద చెరువు రావాల్సిన కాలువ ద్వారా రైతుల పొలాలకు కాలువల ద్వారా నీరు రావడంతో పలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమైక్యాంధ్ర పాలనలో కరువును చూశామని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలు కరువును చూస్తున్నారని, సిద్దిపేట నియోజకవర్గంలో హరీశ్‌రావు కృషితో పాడి పంటలు సమృద్ధిగా పండుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి. కమల్ షరీఫ్, రంగు రాజు గౌడ్, పెరమాండ్ల మల్లేశం, జాజాల చందు, కోనేటి పెద్ద సత్తయ్య, నీల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మన్నే వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం మర్కుక్ మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్‌ఎస్ పాములపర్తి గ్రామ శాఖ అధ్యక్షులు పిట్ల మహేష్, మాజీ యూత్ అధ్యక్షులు కరుణాకర్, మాజీ వార్డు సభ్యులు గణేష్, మ్యాకల శ్రీనివాస్, బాలస్వామి, కనకయ్య, రఘుపతి, సత్తయ్య , తదితరులున్నారు.

గంగమ్మకు పూజలు చేసిన మహేందర్ యాదవ్



నవతెలంగాణ-సిద్ధిపేట

చిన్నకోడూరు మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగమ్మ తల్లి జాతర మహోత్సవనికి కాంగ్రెస్ ఫిషర్మెన్ జిల్లా కార్యదర్శి గుండు వెంకట్, సంఘము సభ్యుల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ గంగమ్మ తల్లిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్శరాం, రాజేష్, భూపతి రెడ్డి, ప్రశాంత్, జయంత్, శేషు, వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన రామయ్య ఇటీవల మృతి చెందడంతో మృతుని కుటుంబానికి మద్దూరు మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని పంపించడంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బందారం సాగర్, మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ మండలంలో పదో తరగతి పరీక్షా రాస్తున్న విద్యార్థులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని బాలుర పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో పెన్నులు పంపిణీ చేసినట్లు మార్కెట్ వైస్ చైర్మెన్ బంక చందు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తరి రవీందర్ పద్మ, వెన్న రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-సంగుపల్లిలో కనువిప్పుతో అవగాహన
-గజ్వేల్ సీఐ బి.సైదా



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

ఏదో ఆశ చూపి సైబర్ నేరస్తులు ప్రజలను మోసం చేస్తున్నారని వారి పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలని గజ్వేల్ సీఐ బి. సైదా అన్నారు. గురువారం రాత్రి గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగుపల్లిలో కనువిప్పు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. గ్రామంలో సైబర్ నేరాల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని కార్యక్రమంతో ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుత న్నాయన్నారు. బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దుని, అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ డీటెయిల్స్ గుర్తుతెలి యని వ్యక్తులకు షేర్ చేయవద్దన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మూఢన మ్మకాలు నమ్మవద్దని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాల న్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిద్దిపేట పోలీస్ కళాబృందం నాటకం, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

-మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత
-చేర్యాల సీఐ ఎల్.శ్రీను

నవతెలంగాణ-చేర్యాల

మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత అని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, మానవ అభివృద్ధి విభాగం స్త్రీ నిధి మండల సమైక్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీనిధి ఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం వీసీఏ, వీసీలకు మానవ అక్రమ రవాణా లైంగిక వ్యాపారం సైబర్ ఆధారిత అక్రమ రవాణా తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా సీఐ శ్రీను హాజరై మాట్లాడుతూ.. తెలిసీ తెలియని వయ సులో పిల్లలకు పెళ్లిళ్లు చేయవద్దని, 18 ఏండ్లు నిండని పిల్లలతో పనులు చేయించ వద్దన్నారు. సైబర్ నేరాలపై మీకు తెలిసిన వారికి మీ బంధువులకు అవగాహన కల్పించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్, సోషల్ మీడియా ఆన్లైన్ బెట్టింగ్, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదా లు తదితర అంశాల గురించి తెలియపర చారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వి.ప్రకాశం, సుజాత, యంఎస్ ప్రెసిడెం ట్, సిసిఎస్/ యం ఎస్ సిబ్బంది, విఓ ప్రెసిడెంట్, విసిఏఎస్ పాల్గొన్నారు.



ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్ రావాలి





-రెండో రోజుకు చేరుకున్న నర్సారెడ్డి పాదయాత్ర

నవతెలంగాణ-గజ్వేల్

ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్ రావాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి చేపట్టిన పాదయాత్ర రెండో రోజు చేరుకుంది. రెండో రోజు శుక్రవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చేరుకుంది. పాదయాత్రకు గజ్వేల్ నియోజకవర్గంలోని 9 మండలాల కార్యకర్తలు నాయకులు కదిలి వచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు భూమిరెడ్డి, ఎలక్షన్ రెడ్డి తదితరులు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నియోజకవర్గంలో అనేక పెండింగ్ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీకి లేదా గజ్వేల్ నియోజకవర్గ కేంద్రానికి రావాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలోనే ఉంటున్నాడు తప్ప నియోజకవర్గ కేంద్రానికి వచ్చి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ముగ్గు చూపడం లేదని కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర ద్వారా కేసీఆర్ నైజాన్ని గవర్నర్కు వివరించేందుకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.

నవతెలంగాణ-కొండపాక

ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం కొండపాక మండలంలో కొనసాగింది. కొండపాక శివారులోని కొమరవెల్లి కమాన్ సమీపం రహదారి నుంచి పాదయాత్ర కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యారాలు ఆంక్ష రెడ్డికి పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు. పాద యాత్రలో కొంత దూరం ద్విచక్ర వాహనంపై మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి ప్రయాణించడం కొసమరుపు.

నవతెలంగాణ-గజ్వేల్

డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి చేపట్టిన పాదయాత్ర శుక్రవారం గజ్వేల్ పట్టణానికి చేరుకున్నది. మున్సిపల్ పరిధిలోని క్యాసారం గ్రామం మీదుగా గజ్వేల్ పట్టణానికి చేరుకొని కోట మైసమ్మ, ఎల్లమ్మ దేవాలయాలను ఆయన దర్శించుకున్నారు. నర్సారెడ్డి పాదయాత్రకు గౌడ సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, పట్టణ అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు

- కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు ఎండీ ఇమ్రాన్
-అదనపు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆత్మ రాములుకు ఘన సన్మానం



నవతెలంగాణ-నంగునూరు

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపుతో పాటు పదువులు ఉంటాయని, ఎవరికి ఏ పదవి ఎవరికి ఇవ్వాలో అధిష్టానానికి తెలుసని నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎండీ ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం నూతనంగా నియామకమైన జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మ రాములును కాంగ్రెస్ పార్టీ తరుపున ఆయన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ ఆత్మ రాములు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో పని చేశారని గుర్తుచేశారు. న్యాయవాద వృత్తిని విజయవంతంగా కొనసాగిస్తున్నారనీ, అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయపరమైన సలహాలు ఇచ్చారని తెలిపారు. ఆయన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి అదనపు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించిం దన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోజు రాములు, పోల్ రెడ్డి నగేష్, నవీన్, అభిరామ్, లడ్డు, మహేందర్, శ్రీధర్, బొజ్జ గోపి, రమేశ్ పాల్గొన్నారు.

ఎండిన గోదావరి నింపకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతాం

-రామ గుండం మాజీ ఎమ్మెల్యే ఓరుగంటి చందర్



నవతెలంగాణ-సిద్ధిపేట

కేసీఆర్ పాలనలో గోదావరి నది నిండుకుండలా ఉండేదని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి కొండ పోచమ్మ వరకు ప్రాజెక్టులన్ని నీటితో గలగల లాడాయని, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఎండిన గోదావరిని నీటితో నింపకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని రామగుండం మాజీ ఎమ్మెల్యే ఓరుగంటి చందర్ అన్నారు. గోదావరి కన్నీటి కోసం పేరుతో రామగుండం నుంచి కొండపోచమ్మ వరకు 180 కిలోమీటర్ల పాదయాత్రను ఆయన చేపట్టారు. శుక్రవారం సిద్దిపేట పాదయాత్ర చేరుకోగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొండ పోచమ్మ వరకు వివిధ ప్రాజెక్టులను నిర్మించి నీటితో నింపి రైతులకు వ్యవసాయానికి అందించాడన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని అబద్ధాలు చెప్పి, వాటిని నిజం చేయడానికి 15 నెలలుగా నీటిని ఎత్తిపోయడం లేదని, దాని మూలంగా ప్రాజెక్టులన్ని ఎండిపోతున్నాయన్నారు. సింగరేణి కాలనీలలో మురికి నీరును శుద్ధిచేసి మళ్లీ తాగడానికి మంచి నీటిగా పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. తమ గోస అందరికీ తెలవడం కోసమే కొండపోచమ్మ వరకు పాదయాత్ర చేపట్టామని, ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలుస్తామని అన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పాదయాత్రకు ఘన స్వాగతం

నవతెలంగాణ-కొండపాక

గోదావరి కన్నీటి గోస పేరుతో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుగంటి చందర్ గోదావరిఖని నుంచి చేపట్టిన పాదయాత్ర శుక్రవారం కొండపాక మండలం దుద్దెడకు చేరుకుంది. పాదయాత్ర మండల బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కొండపాక మండలం బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాదయాత్రకు స్వాగతం పలికి వారి వెంట నడిచారు. ఈ సందర్భంగా దుద్దెడలో చందర్ మాట్లాడుతూ.. తెలంగాణను సస్య శ్యామలం చేయాలని గొప్ప లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మాణం చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని ఎడారిగా మార్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. పంట పొలాలకు వెంటనే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంట పొలాలు మంత్రులకు కనబడతలేవానని ప్రశ్నించారు. నీరు లేక అల్లాడుతున్న రైతుల బాధలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వారి వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తుల స్వీకరణ

-ఏఓ సంతోష్



నవతెలంగాణ-బెజ్జంకి

వ్యవసాయ యాంత్రికరణలో ఎస్ఎంఏఎం పథకంలో వ్యవసాయ పనిముట్లను 50 శాతం రాయితీపై అందజేయడానికి మహిళ రైతుల నుంచి ఈ నెల 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఏఓ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పనిముట్లకు మహిళ రైతులు పాసు పుస్తకం, ఆధార్, పోటో దరఖాస్తులు ఏఈఓలకు అందజేయాలని ఏఓ సంతోష్ పేర్కొన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ నోడల్ పోటీలు



నవతెలంగాణ-సిద్ధిపేట

కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ రెండో రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటలో జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి సునీత సభ అధ్యక్షత వహించారు. యూత్ పార్లమెంట్‌లో భాగంగా యువత యొక్క అభిప్రాయాన్ని దేశ నిర్మాణంలో ఉపయోగించుకోవాలని ఉద్దేశంను విద్యార్థుల మాటల్లో, వీడియోలో జడ్జిలు విన్నారు. పదిమందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, జిల్లా కోర్డినేటర్ డా. ఎం. శ్రద్దానందం, వైస్ ప్రిన్సిపాల్ డా. తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

నవతెలంగాణ-చేర్యాల

పదో తరగతి పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు ముస్త్యాల గ్రామంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో 180, పెద్దమ్మ గడ్డలోని బాలుర పాఠశాలలో 193, సాంఘిక సంక్షేమ పాఠశాలలో 200, ముస్త్యాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో 187 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు వంద శాతం విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నట్లు మండల విద్యాశాఖ అధికారి రచ్చ కిష్టయ్య తెలిపారు.

అంబులెన్స్‌లో డెలివరీ



నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్దిపేట రూరల్ మండలం పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లపు శృతి (21)కి అకస్మాత్తుగా నొప్పులు రావడంతో, ఆమెను అంబులెన్స్‌లో సిద్దిపేటకు తీసుకు వస్తుండగా ఇరుకోడు గ్రామం వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో సకాలంలో, సమయ స్పూర్తితో స్పందించి డెలివరీని అంబులెన్స్ సిబ్బంది చేశారు. మగ బిడ్డ జన్మించాడు. తల్లి బిడ్డ క్షేమంగా ఉండడంతో, వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్నీషియన్ నరేందర్, పైలెట్ వెంకటేశం, ఉన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్‌లో శుక్రవారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. అసోసియేషన్ అధ్యక్షునిగా యాళ్ళ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా బోయిని సురేష్, జనరల్ సెక్రటరిగా సదానందం, జాయింట్ సెక్రటరి జెరిపోతుల రవీందర్, కోశాధికారి కొంకట శ్రీనివాస్, లైబ్రరీ సెక్రటరీ బానోతు శ్రీనివాస్ నాయక్, స్పోర్ట్స్, లైబ్రరీ సెక్రటరిగా చింతకింది భాస్కర్ , కార్యనిర్వాహక సభ్యునిగా దికొండ ప్రవీణ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రఘువీర్ తెలిపారు.

నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం

-బీఆర్ఎస్ మండలాధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



నవతెలంగాణ-తొగుట

నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని తొగుట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో మంజూరైన వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మక్కల లక్ష్మి, ఈదుగాళ్ల మనోజ్, గోవర్ధన గిరి మదిర గ్రామం చిన్న ముత్యంపేటకు చెందిన తుమ్మల సుభాషిణి, చందాపూర్ గ్రామానికి కు చెందిన వర్గంటి సత్యలక్ష్మి లకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో నాయకులు నంట పరమేశ్వర్ రెడ్డి, సుభాష్ గౌడ్, సిరిసిల్ల రాజేష్, బండారు స్వామి గౌడ్, సుతారి రాములు, పిట్ల వెంకటయ్య, నరేష్, స్వామి తదితరులు ఉన్నారు.

అధిక సాంద్రత పద్ధతిలో ప్రతి సాగుపై రైతులకు అవగాహన

-జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

నవతెలంగాణ-రాయపోల్

అధిక సాంద్రత పద్దతిలో ప్రత్తి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి రాధిక అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రం రైతు వేదికలో అధిక సాంద్రత ప్రత్తి సాగు పై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో చీడ పీడల యాజమాన్యం గురించి చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలిపారు. అదేవిధంగా ఎరువుల యాజమాన్యం మరియు మొక్క ఎదుగుదల నియంత్రకాలైన మెపిక్వాటుక్లోరైడ్ (చమత్కార్) దాని యొక్క ఉపయోగాలు, రైతుల సందేహాలకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.నల్కర్,కీటక శాస్త్ర నిపుణులు డా. రవి, అగ్రానమీ శాస్త్రవేత్త ప్రతాప్ రెడ్డి లు వీరు కూడా రైతులకు అధిక సాంద్రత ప్రత్తి సాగు



పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏ డి ఏ బాబు నాయక్, మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు రజిత , కవిత, ప్రవీణ్, స్వర్ణలత, కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధ కులు,రాశి విత్తన బృందం, రైతులు పాల్గొన్నారు.

యువతకు నిరాశే..

-రాష్ట్ర బడ్జెట్ పై బిగుళ్ల మోహన్



నవతెలంగాణ-బెజ్జంకి

బడ్జెట్ యువతను విస్మరించిందని బీఆర్ఎస్ యువజన మండలాధ్యక్షుడు బిగుళ్ల మోహన్ శుక్రవారం అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలండర్, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి బడ్జెట్‌లోనైనా నిరుద్యోగ యువతకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు రూ.4 వేలు నిరుద్యోగ భృతికి నిధులు కేటాయిస్తారేమోనని ఆశలు పెట్టుకురన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా ఎన్నికల్లోని ప్రధాన డిమాండ్ నిరుద్యోగ భృతి పదమే ఊసేత్తకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులో పేరు ఉంటేనే అర్హులని చెప్పడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే బడ్జెట్ ను సవరించి నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలకై రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ రేటును దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్ హామీల ప్రస్తావనే లేకుండా బడ్జెట్ ను ప్రవేశపెట్టారని, యూత్ కు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

మానవ అక్రమ రవాణాపై మహిళలకు అవగాహన

-దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్



నవతెలంగాణ-దౌల్తాబాద్

మహిళలు సైబర్ నేరాలు నూతన చట్టాలు సామాజిక రుగ్మతులపై అవగాహన కలిగి ఉండాలని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల అధ్యక్షులు, వివోఏలకు మహిళల రక్షణ, చట్టాలు, షీ టీమ్ విధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షీ టీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాలు, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, అక్రమ మానవ రవాణా, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. నూతన చట్టాలు, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి భద్రత మా ముఖ్య బాద్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం యాదగిరి, సీసీలు, వివోఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ వెంటనే పెంచాలి

-టీజీడీజెఏసి గౌరవ అధ్యక్షులు దండు శంకర్, అధ్యక్షుడు చిట్టెల సంపత్



నవతెలంగాణ-సిద్ధిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పింఛన్‌ను వెంటనే పెంచాలని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు దండు శంకర్, అధ్యక్షుడు చిట్టెల సంపత్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.4016 పింఛన్‌ను రూ. 6016 కు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి దివ్యాంగులు అంటే ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. దివ్యాంగులకు పింఛన్ పెంచని యెడల రాష్ట్రంలో ఎక్కడికక్కడ రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిజిడిజెఏసి గౌరవ సలహాదారులు బొంగోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు కేమ్మసారం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అధర్మంపై కాంగ్రెస్ విజయం సాధించింది

-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ-సిద్ధిపేట

ఎన్జీవో సంఘాలు ఇచ్చిన నిత్యవసర సరుకులు ఉన్న రంజాన్ తోఫాలను బీఆర్ఎస్ పార్టీ ఇచ్చినట్లుగా ఎన్ని కుట్రలు పన్నినా చివరికి అధర్మంపై కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ముస్లింల అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన తన్జీమ్ బీఆర్ఎస్ నాయకుల కాళ్ల అడుగులకు మడుగులు వత్తడం మానుకోవాలన్నారు. ఇకనైనా తంజీమ్ కమిటీలో మార్పు రావాలని, లేదంటే ముస్లిం ప్రజల ఆగ్రహానికి గురిగాక తప్పదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా నిరుపేద ముస్లింలకు రంజాన్ గిఫ్టులు అందిస్తే మేము స్వాగతిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే ముస్లింల అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వహాబ్, యువజన పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యుఐ డిస్టిక్ ప్రెసిడెంట్ అజ్మత్, ఎన్ఎస్ యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రషాద్, మైనార్టీ పట్టణ అధ్యక్షులు సలీం, అజ్మత్ అలీ, జునేద్ తదితరులు పాల్గొన్నారు.

మర్మముల గ్రామంలో కోటి తలంబ్రాల దీక్ష

-గజ్వేల్ కేంద్రంగా తెలంగాణ వ్యాప్తంగా పాల్గొంటున్న భక్తులు



నవతెలంగాణ-మద్దూరు

గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కోటి తలంబ్రాల దీక్ష గ్రామ గ్రామాన జరుగుతుంది. శుక్రవారం మద్దూరు మండలం మర్మముల గ్రామంలో శ్రీరామదూత భజన మండలి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల దీక్ష ఘనంగా నిర్వహించారు. భక్తులందరు రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఓలిచి వారిలో ఉన్న రామభక్తిని చాటుకున్నారు.

ఎండల్లో వర్షం..చల్లబడిన వాతావరణం



నవతెలంగాణ-మర్కుక్

గత నెల రోజులుగా తీవ్రమైన ఎండ వేడితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వర్షం కురవడంతో ఉపశమనం కలిగించింది. మండల కేంద్రమైన మర్కుక్‌తో పాటు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం వర్షం పడి వాతావరణం చలబడిది. సాయంత్రం 4గంటల వరకు భానుడి ప్రతాపానికి వేడి వేడి సెగలతో పలు ఇబ్బందులు పడ్డారు. అయితే సాయంత్రం ఉరుములుతో కురిసిన వర్షానికి కురవడంతో మండల ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.



నవతెలంగాణ-గజ్వేల్

నెల రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ప్రజలు ఉక్కపోతకు ఉక్కిరి బిక్కిరయారు. శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి ఉపశనం కలిగింది. ఎండిపోతున్న పంటలకు కొంత లాభం జరిగే అవకాశం ఉంది. ఉరుములు మెరుపులతో దాదాపు గంటకు పైగా వర్షం కురిసింది.

యువతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-బెజ్జంకి : సామాజిక మాధ్యమాలు సైబర్ నేరాలకు ఊతం పోస్తున్నాయని, యువతులు తమ పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్లు జనార్ధన్, బేగ్ మహిళలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మానవుల అక్రమ రవాణ, సైబర్ నేరాలు, లైంగిక వ్యాపారం అంశాలపై పోలీస్ శాఖ నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మండలంలోని అయా గ్రామాల వీఓఏ, సీఏలు హజరయ్యారు. ఏపీఎం నర్సయ్య, సమైక్య మహిళ మండలాధ్యక్షురాలు మంజుల, కానిస్టేబుల్ సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

యువవికాసంలో రెడ్డి పేదలకు అవకాశం కల్పించాలి

-రెడ్డి జేఏసీ మండలాధ్యక్షుడు ముక్కీస తిరుపతి రెడ్డి

నవతెలంగాణ-బెజ్జంకి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు రెడ్డి సామాజిక వర్గంలోని పేద యువతకు అవకాశం కల్పించాలని రెడ్డి జేఏసీ మండలాధ్యక్షుడు ముక్కిస తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెడ్డి సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన యువతీ యువకులున్నారని వారి స్వయం ఉపాధికి ప్రభుత్వం తోడ్పాటు అందించేల.. రెడ్డి కార్పొరేషన్‌ను అమల్లోకి తీసుకువచ్చి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

సమాజానికి కవిత్వం ఎంతో అవసరం



నవతెలంగాణ-సిద్ధిపేట

సమాజం మార్పు కోసం సకలం అన్వేషించి అక్షరాల వినసొంపుతో బావాత్మకమైన సవ్వడితో మార్పు తెచ్చేదే కవిత్వమని కవి ఐతా చంద్రయ్య అన్నారు. ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా సిద్ధిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలానుగున మార్పులతో పాటుగా సాహిత్య సృజన ముందుకు సాగాలన్నారు. కవి ఉండ్రాళ్ళ రాజేశం సమాజంలో ఉన్న సమస్యలపై కవితా రచన సాగించాలని, అందుకు యువత ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కవులు ఎన్నవెల్లి రాజమౌళి, వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, చీకోటి రాములు, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సింగీతంలో బీరప్ప స్వామి జాతర



నవతెలంగాణ-రాయికోడ్

మండలంలోని సింగీతం గ్రామ శివారులోని బీరప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 22 నుంచి 26 వరకు జాతర ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కుర్మ సంఘం అందోల్ నియోజకవర్గ అధ్యక్షులు రాజు కుర్మ తెలిపారు. శుక్రవారం సింగీతం శివారులోని బీరప్ప స్వామి ఆలయ ఆవరణలో జాతర మహోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 22న గంగమ్మ తల్లికి బోనం తీయుట, లింగాలను గుడికి చేర్చుట, 23న బియ్యం సుంకించుట, గ్రామ పుర వీధులగుండా బోనాలు తీయుట, అన్నదాన ప్రసాదం, 24న బీరప్ప స్వామి, కామరాతి కళ్యానోత్సవం, 25న దేవునికి పాలు పొంగించుట, 26న జాతర ముగింపు సందర్భంగా ఒగ్గు కలకారుల చేత నాగవెల్లి బోనాలు, ఒగ్గుకథలు చెప్పుట వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కుర్మ సంఘం అధ్యక్షులు పుష్ప నగేష్ కుర్మ, కుల పెద్దలు హాజరవుతారని తెలిపారు.

అంబేద్కర్ అభయహస్తం రూ.12 లక్షలను కేటాయించాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,04,965 కోట్లతో పెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో రూ.40,232 కోట్లతో ఎస్సీ అభివృద్ధి ఫండ్ క్రింద కేటాయించారని కేవీపీఎస్ మండలం నాయకులు గణపతి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కేటాయింపు జరగలేదని, అంబేద్కర్ అభయహస్తానికి ఏటా రూ.750 కోట్లు కేటాయించి ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షల రూపాయలను ఇస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయిందన్నారు. బడ్జెట్‌ను వెంటనే సవరించి దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని కెవిపిఎస్ మండల నాయకుడు గణపతి డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-టేక్మాల్

మండలంలోని సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మీ చెక్కులను లబ్దిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షులు సుబేదార్ మాని కిషన్, జోగిపేట్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీలు మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు బత్తుల కిషోర్, మహేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, డైరెక్టర్లు నరసింహారెడ్డి, పాపయ్య రాజేష్ గౌడ్, సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ రామచందర్, సక్రు, సాగర్, నాగరాజు, సాయ గౌడ్, మానయ్య మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

సంగుపేటలో పాలాభిషేకం



నవతెలంగాణ- జోగిపేట

బీసీ రిజర్వేషన్ 42 శాతం, ఎస్సీ రిజర్వేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు శుక్రవారం ఆందోల్ మండల పరిధిలోని సంగుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సంజీవులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు శివశంకర్ గౌడ్, యూత్ అధ్యక్షులు చంద్రశేఖర్, రాఘవేందర్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, మల్లారెడ్డి, సుదర్శన్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన వార్షిక పరీక్షలు

నవతెలంగాణ-న్యాల్ కల్

పదో విద్యార్థులు వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరగాయని ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు చీఫ్ సూపరింటెంట్ రాజిరెడ్డి రాజ్ కుమార్ పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగాయి . పది పరీక్షలు 416 మంది విద్యార్థులు పరీక్షలు హాజరై రాశారు. పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టంగా జరిగాయి . మెటల్ కుంట, హద్నూర్, పరీక్ష కేంద్రాలను చిటింగ్ స్కాడ్ అంజయ్య పరిశీలించారు . పరీక్షలకు ఎలాంటి పకడ్బందీగా జరిగేందుకు ఎస్సై చల్ల రాజశేఖర్ పర్యవేక్షించారు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి

నవ తెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి అన్నారు. శుక్రవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించి, స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు మాట్లాడుతూ 1974లో అన్ని ప్రాంతాల్లో ,అన్ని మేనేజ్మెంట్లలో ఉపాధ్యాయ సంఘం ఉండాలని సంకల్పంతో ప్రారంభించిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విద్యారంగంలో పలు సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ ఎదిగిందని, వెంకట స్వామి త్యాగం, పట్టుదల ,కృషి వల్ల సంఘం అన్ని జిల్లాలకు విస్తరించిందని తెలిపారు. ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేల్స్, అం ట్రెండ ఉపాధ్యాయుల అర్హతలు సాధించడం, సంఘాన్ని రాష్ట్రమంతటా వ్యాపింప చేయడం వారు చేసిన కృషి ఫలితమే నని అన్నారు. రాష్ట్రంలో సర్వీసు రూల్స్ సమస్య పరిష్కారం కోసం, అప్రెంటిస్ విధానం రద్దు కోసం 2008 లో 13 రోజుల సమ్మె అనంతరం అప్రెంటిస్ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు సాధించడం, 2009లో ఉపాధ్యాయులకు 32 వేల పదోన్నతులు సాధించడం, సిపిఎస్ విధానం రద్దు కోసం చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం, నూతన విద్యా విధానం-2020 రద్దు చేయాలని జాతీయస్థాయి కన్వెన్షన్ ఏర్పాటు చేయడం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదికలు సమర్పించడం, ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కావడానికి ప్రాథమిక పాఠశాలలని తరగతికి ఉపాధ్యాయుడు ఉండే విధంగా తీర్చిదిద్దాలని, తెలుగుతో పాటు ఇంగ్లీష్ మీడియం కూడా సమాంతరంగా ప్రవేశపెట్టాలని టీఎస్ యుటిఎఫ్ నిరంతరం ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తూ వచ్చింది అని అన్నారు. ఆ ఫలితంగా ఇంగ్లీష్ మీడియం ప్రారంభించడం జరిగింది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 30% ఫిట్మెంటుతో మొదటి పి ఆర్ సి సాధించుకోవడం, 2024లో పదోన్నతులు సాధించుకోవడం, తదితర విజయాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా, ఉపాధ్యక్షులు జే .కాశీనాథ్, కోశాధికారి పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి. సాయితేజ, ఆర్.సింహాచలం, వి . అనురాధ,పి . ప్రసన్న నాయకులు కమలాకర్ రావు, దిలీప్ సింగ్ ఠాగూర్, సంజీవయ్య, మునిస్,ప్రభాకర్,సైమన్ సురేష్, కృష్ణ,జగన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిన్నారం మండల పరిధిలోని జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం నుంచి 124 మంది విద్యార్థులు, స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల కేంద్రం నుంచి 246 మంది విద్యార్థులు, అలాగే బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ పరీక్షా కేంద్రం నుంచి 179 విద్యార్థులకు 177 మంది విద్యార్థులు బొల్లారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల బి సెంటర్ నుంచి 159 మంది విద్యార్థులకు 158 మంది విద్యార్థులు తెలంగాణ మోడల్ స్కూల్ బొల్లారం పరీక్ష కేంద్రం నుంచి 256 మంది విద్యార్థులకు 254 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. తొలి రోజు ప్రథమ భాష పరీక్షలకుగాను ఆయా కేంద్రాలలో విద్యార్థులు ఉత్సాహంగా హాజరై కేటాయించిన గదుల నంబర్లు చూసుకోవడం హుషారుగా పరీక్షలకు వెళ్లడం విద్యార్థుల సందడి కనిపించింది. మంగంపేట జిన్నారం శివానగర్ కొడకంచి మాదారం వావిలాల చెట్ల పోతారం బొల్లారం తదితర పలు పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారు. సదరు కేంద్రాలకు మొత్తం 964 మంది విద్యార్థులను కేటాయించడం శుక్రవారం 959 మంది విద్యార్థులు తొలిరోజు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారు. సంబంధిత అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలో పదో తరగతి పరీక్షల్లో భాగంగా తొలిరోజు ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి. ఇందులో భాగంగానే మునిపల్లి మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలలో (కంకల్ జెడ్పిహెచ్ఎస్-సెంటర్‌లో 140మంది విద్యార్థులకుగాను 140 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 124 మంది విద్యార్థులకుగాను 123 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఒకరు గైర్హాజర్ అయ్యారు. మునిపల్లి మోడల్ స్కూల్ లో 174 మంది విద్యార్థులకు 174 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పెద్దచెల్మెడ జెడ్ పి హెచ్ ఎస్ సెంటర్‌లో 83 మందికిగాను 83 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. నాలుగు సెంటర్లకు కలిపి మొత్తం 521 మంది



విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజర్ కావడంతో 520 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరైనట్లు, నాలుగు పరీక్ష కేంద్రాలలో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని మండల విద్యాధికారి భీంసింగ్ తెలిపారు.

నవతెలంగాణ-వట్పల్లి

మండలంలోని దేవూనూర్ మర్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాలలో పది పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి దేవూనూరు ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం ఆర్ అండ్ బి రహదారి నుండి రెండు కిలోమీటర్లు మారుమూల ప్రాంతంలో ఉండడం వలన ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పరీక్ష సెంటర్‌కు చేరుకోవడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతూ సెంటర్‌కు చేరుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పరీక్ష ప్రారంభ ముగింపు సమయంలో బస్సు సౌకర్యం కల్పించినట్లయితే విద్యార్థిని విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఆయాగ్రామాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు పరీక్ష సెంటర్లను మండల విద్యాధికారి పర్యవేక్షించారు

వేడితో సతమత మవుతున్న ప్రజలకు ఉపశమనాన్ని కలిగించిన వర్షం



నవతెలంగాణ-నార్సింగి

గత కొద్ది రోజులుగా మండల వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు పెరిగి ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండలు తీవ్రంగా కాస్తూ మార్చి నెలలోనే, మే నెలను తలపిస్తూ భయ పెడుతున్నాయి. పగటి పూట బయటకు వెళ్ళాలన్నా జంకే పరిస్థితులు కనబడుతున్నాయి. ఎండ, వేడి తీవ్రత తో సతమత మవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తూ శుక్రవారం వర్షం కురిసింది. వాతావరణం మధ్యాహ్నం నుంచే చల్లగా మారి సాయంత్రం దాదాపు 5 గంటల నుంచి ఉరుములు మెరపులతో చిన్నగా మొదలయిన వాన క్రమంగా పెరుగుతూ వాతావరణాన్ని చల్ల బడేలా చేసింది. వేడితో ఉపశమనం పొందిన జనానికి తోడు, అకాల వర్షం కురవడంతో పొట్ట దశలో ఉండి సాగు





నీరు లేక వరి పంటలు ఎండి పోతున్న దశలో కురిసిన వర్షానికి పంటలకు మేలు జరుగుతుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-న్యాల్ కల్ : న్యాల్‌కల్, హద్నూర్, ముంగి, రేజింతల్, మిర్జా పూర్ (బి), పలు గ్రామాల్లో ఎండలతో సాయంత్రం ఒక్కసారిగా అకాల వర్షం కురిసింది . మండుతున్న ఎండలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఉపశమనాన్ని కలిగించింది. వర్షం చినుకులు వాతావరణం ఒకేసారిగా చల్లబడింది. మేఘాలు కమ్ముకుని ఉరుములు మెరుపులతో వర్షం ఏకధాటిగా కురిసింది. గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు .

అకాల వర్షం మొక్కజొన్న ధ్వంసం

నవతెలంగాణ-వట్పల్లి : మండలంలో అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకొరిగింది ఒకేసారి ఉరుములు మెరుపులతో కూడిన చినుకులు ప్రారంభం కావడంతో పొట్ట దశలో ఉన్న పంటలు నేలపాలవుతాయేమోనని రైతులలో ఆందోళన మొదలైంది కొన్నిచోట్ల ఇప్పటికే టమాటాకు ధర పడిపోవడంతో పెట్టుబడి కూడా రాని



పరిస్థితి దాపురించడంతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న టమోటా రైతుకు అకాల వర్షం మరింత నిరాశ నిస్పృహలకు గురి చేసింది. అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట, రేగోడు మండలాలలో అక్కడక్కడ ఈదురు గాలులకు చెట్లు నేల కొరిగాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాలు రైతులను బయందోళనకు గురిచేస్తున్నాయి .

గాలి వాన బీభత్సం

నవతెలంగాణ-పాపన్నపేట : గాలివాన బీభత్సం సృష్టించింది పాపన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివానకు మండలంలోని గాంధారి పల్లి లో మామిడి తోటలలో మామిడికాయలు నేలరాలినావి. చింత చెట్లకు చింత పండు తడిసి ముద్దయింది. మరికొన్ని చోట్ల ఈదురుగాళ్లకు చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ కు అంతరాయం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో అంధకారం నెలకొంది. వరి రైతులకు మాత్రం ఎండిపోయే దశలో ఉన్న పొలాలకు ఈ వర్షం ఎంతగానో మేలు చేసింది. వరి రైతులలో ఆనందం కనిపించింది.